
# అమ్మకడుపు చల్లగా - 2

ఆత్మకథ

- గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 223

కౌముది మాసపత్రికలో

జనవరి 2020 సంచిక నుంచి నవంబర్ 2020 సంచిక వరకూ

వచ్చిన ఆత్మకథ ధారావాహిక

స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి 11 సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 2018 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

## (ప్రారంభం)

వయస్సు అరవై దాటాక సాధారణంగా జీవితం ఈడిగిలపడుతుంది. జీవనయానం మాగన్ను పెడుతుంది. అంతవరకూ చేయగలిగిన పనులు అసాధ్యంగా కనిపిస్తాయి. తెలీని నిస్త్రాణ జీవితాన్ని ఆవరించుకుంటుంది. ఇది వృద్ధాప్యమనే ముసురుకి సూచన.

కానీ నా జీవితంలో ఇదేదీ జరగలేదు. ఎప్పటిలాగే రోజులు పరుగులు తీశాయి. ఏ నలభయ్యో యేటనో తిరిగిన మలుపులు విశ్వరూపం దాల్చి ఎప్పటికప్పుడు బులిపించాయి. మనస్సూ, శరీరమూ వయస్సు మీద ముసుగు కప్పి ముందుకు తోసుకుని నడిపించాయి. అందుకే ఈ రెండో భాగం. ఇది ముగింపుకి ప్రారంభం కాదు. ప్రారంభానికి కొనసాగింపు.

నన్ను కొందరు అడుగుతుంటారు. మీ పిల్లల్లో ఎవరయినా మీ వ్యాసంగం వేపు తొంగి చూశారా అని. తొంగి చూడడమే కాదు. ఒక కుర్రాడు సినీమా వ్యాసంగంలో పూర్తిగా మునిగి ఇంక తేలలేదు. మా అఖరి అబ్బాయి - శ్రీనివాస్. ఇది చరిత్ర.

ఇక, మా పెద్దబ్బాయి సుబ్బారావు చదువు ఏవో కారణాలకి మొదట్నుంచీ సరిగా సాగలేదు. దరిమిలాను పూనుకుని మిత్రుల సహాయంతో బియ్యే చదివి అవుననిపించాడు. అయితే డిగ్రీల ప్రమేయం లేని చురుకుదనం కలవాడు. అతనికిప్పుడు 56. ఓ రోజు ఉదయం సుబ్బారావు నా గదిలోకి దూసుకు వచ్చాడు. "నేను ఎమ్మే పరీక్షకి వెళ్తాను" అన్నాడు. అప్పటికి అతనికి 45 సంవత్సరాలు. ఏమయింది ఇతనికి? ఎందుకీ హఠాత్ పరిణామం? సమాజ సంస్కారమే కాక, కుటుంబ సంస్కారం కూడా అతణ్ణి రెచ్చగొడుతూ ఉండాలి. అతని తమ్ముడు మధ్యవాడు రామకృష్ణ ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్మే ఎం.ఫిల్.

సరే. చదువు ఏనాడూ ఆక్షేపణ కాదు. ఏం చేస్తావు? అన్నాను. ఇంగ్లీషు సాహిత్యంలోనే ఎమ్మే చదువుతానన్నాడు. నన్ను ప్రశ్న అడిగిన మిత్రులు గమనించాలి. ఓ రచయిత, నటుడి పెద్ద కొడుకు జీవితంలో ఆలశ్యంగా సాహిత్యం వేపు. అదిన్నీ ఇంగ్లీషు సాహిత్యం వేపు దృష్టిసారించాడు. అభ్యంతరం ఏముంది? నేనూ, మా రెండో అబ్బాయీ అతనికి గురువులం అయాం.

తమ్ముడు అన్నగారికి పాఠాలు చెప్పాడు. మద్రాసు యూనివర్సిటీకి పరీక్ష కట్టాడు. నేను బెర్టోల్ట్ బ్రెక్ట్, హెరాల్డ్ పింటర్, శామ్యూల్ బెకెట్, టెన్నిసీ విలియమ్స్ (ఎ స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్) వంటి రచయితల రచనల్ని చెప్పాను. ఆంగ్ల సాహిత్యంలో ఎప్పుడూ ఉండే కోర్స్ - షేక్స్‌పియర్. అదొక ప్రత్యేకమైన పేపరు. ఆ పేపర్లో ఏ ప్రశ్న వచ్చినా షేక్స్‌పియర్ గురించి రాసే రెండు పేజీల ఉపోద్ఘాతాన్ని

తయారు చేశాను. ఇవికాక ప్రముఖ తెలుగు రచయిత బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' ఒక పాఠ్యపుస్తకం. అది నాకు నల్లేరు మీద బండి. ఆడుతూ పాడుతూ చెప్పాను.

మరొక్కసారి - సుబ్బారావు మేధకుడు కాదు. ఎమ్మే పదిహేడూ పేపర్లు చదివి, పరీక్ష రాసి అన్నింటినీ మొదటి ప్రయత్నంలోనే పాసయిపోయాడు. ఇప్పుడతను ఎమ్మే. మరొక ఆలోచన అతణ్ణి నిలదీస్తోంది. తమ్ముడు ఎం.ఫిల్, తానూ ఎంఫిల్ చేస్తానన్నాడు. భేష్. విజ్ఞానం వ్యసనం. డిగ్రీకోసం కాక కేవలం ఉత్సాహంతో సాగిన చదువిది. ఇప్పటి పరీక్షలో గెలుపు వెన్నుతట్టింది. సరే ఎం.ఫిల్ సబ్జెక్టు ఏమిటి? హెరాల్డ్ పింటర్ "లుక్ బాక్ ఇన్ ఏంగర్" అతని మనస్సుని బాగా ఆకట్టుకుంది. అది ఒక విధంగా దాదాపు పదిహేనేళ్ళ కిందట నా నాటకానికి స్ఫూర్తి - 'జగన్నాటకం.' నా మీదా, చాట్ల శ్రీరాములు మీదా ఉన్న అభిమానంతో ఆ రోజుల్లో సాలూరులో నాకు జరిగిన సన్మానం తరువాత ప్రదర్శించిన 'జగన్నాటకం' చూడడానికి వచ్చాడు సుబ్బారావు.

నాది ఓ ఆలోచన. ఈ రెండు నాటకాలనూ కలిపి సంధిస్తే? రెండింటిలోనూ ప్రధాన పాత్ర పెట్టుబడి - ఆవేశం, ఆగ్రహం. దేనిమీద? ఎందుకు? ఇదీ పరిశోధనకి ప్రాతిపదిక. శీర్షిక వచ్చేసింది. The Colour Of Anger In East And West (A commparitive study of john Osborne's "Look back in Anger" and Gollapudi Maruthi Rao's "Go To Hell" )

నా తెలుగు నాటకాన్ని ఈ దృష్టితో చదివి సుబ్బారావు నిర్ఘాంతపోయాడు. "చదువుతూంటే నేను ఊహించినదానికంటే పవర్‌ఫుల్‌గా ఉంది. నీ పాత్ర జెన్నీ (ఆస్బార్న్ పాత్ర) కంటే ఎన్నో రెట్లు శక్తివంతంగా ఉంది" అన్నాడు.

అయితే మద్రాసు యూనివర్సిటీ రూల్స్ ప్రకారం బతికున్న రచయితల మీద పరిశోధనకి అవకాశం లేదు. కనుక తప్పనిసరిగా దగ్గరగా ఉన్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎంపిక చేశాం. నాకు మంచి మిత్రుడు, అభిమాని మధురాంతకం నరేంద్ర. వాళ్ళ నాన్నగారు, ప్రముఖ రచయిత మధురాంతకం రాజారాంగారు నాకు మిత్రులు. నేను చిత్తూరులో పనిచేసే రోజుల్లో (1960 -63) ఒకటి రెండుసార్లు ఆయన ఊరు దామల చెరువు వెళ్ళాను. అక్కడ మరొక మిత్రుడు కలువకొలను సదానంద. దామల చెరువులో రాజారాంగారు తెలుగు పండితుడు.

ఇప్పుడు సుబ్బారావుని తీసుకుని తిరుపతి వెళ్ళాను. ఆనందంగా ఆయనకి 'గైడ్'గా ఉండడానికి నరేంద్ర అంగీకరించారు. ఇక్కడ అనుకోని విచిత్రం నరేంద్ర నాన్నగారు నాకు మిత్రుడు. నరేంద్ర మా అబ్బాయికి గురువు.

మా అబ్బాయితో నరేంద్ర అన్నారట: I am thrilled. Normally it takes 6 months to select the subject. Your father is brilliant. He gave a subject which is a ocean


అయితే - పరిశోధన (నిజానికి ఎం.ఫిల్ అంటే సుదీర్ఘమయిన పరిశోధన వ్యాసం) ఇంగ్లీషులో జరగాలి. నా నాటకాన్ని ఇంగ్లీషులో ఉదహరించాలి. కానీ నాటకం తెలుగు నాటకం. ఎలా? అప్పుడు కూర్చుని కేవలం మా అబ్బాయి పరిశోధనకు 'గో టు హెల్' తెలుగు నాటకాన్ని పూర్తి ఇంగ్లీషులో వ్రాశాను. తీరా పూర్తయ్యాక మిత్రులు, ఇంగ్లీషు లెక్చరర్ అవసరాల రామకృష్ణారావుగారికి చూపించాను. idiomatic సవరణలు సూచించమని. ఆయన సమీక్ష:


*"నేను మూర్ఛపోయాను. చాలా బాగా రాశారు. ఇది నా ఆలోచనలకి దగ్గర. ఇది ఎం.ఫిల్.కి మంచి సబ్జెక్టు. ఇప్పుడు నాకు తెలుగు నాటకం చదవాలని ఉంది."*

నాటక ప్రయోక్త తన చిన్నతనం నుంచీ ఎరిగిన చాట్ల శ్రీరాముల్ని హైదరాబాదు నుంచి పిలిపించి సమగ్రంగా ఇంటర్వ్యూ చేశాడు.

సంవత్సరం తిరగకుండా సుబ్బారావు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ డిగ్రీ పుచ్చుకున్నాడు. ఇదీ ఆయన గురువు, మిత్రుడు మధురాంతకం నరేంద్ర స్పందన.

ఇంత చెప్పినా అడపా తడపా మిత్రులు అడిగిన సందేహం నివృత్తికాదు. మా పిల్లల్లో ఎవరయినా నా వ్యాసంగం వేపు ప్రయాణం చేశారా అన్నది.




కథ ఇంకా ఉంది. మా అబ్బాయి డిగ్రీ పుచ్చుకున్నాక లండన్ వెళ్ళి వారం రోజులపాటు క్రైం నవలా రచన మీద కోర్స్ చేసి వచ్చాడు. వస్తూనే ఒక క్రైం నవలా రచనకి ఉపక్రమించాడు. ఒక్క అక్షరంతో నా ప్రమేయం లేదు. నవల పేరు - No Murder Tonight పుస్తకాన్ని ఒక ఆంగ్ల ప్రచురణకర్త ప్రచురించాడు.

ఆ నవలని ప్రముఖనటుడు, మా కుటుంబానికి ఆప్తుడు కమల్ హాసన్ ఆవిష్కరించాడు. 60 ఏళ్ళ కిందట నా తొలికథని, నవలని ఎవరయినా చదివారో లేదో గుర్తులేదు. కాలం మారింది. మాధ్యమాలకు వయసొచ్చింది. కాగా, సుబ్బారావు ప్రముఖ నటుడు, రచయిత కొడుకు. పరపతి సగం కలిసొచ్చింది. నవల మంచి హిట్.

వెంటనే పూనుకుని రెండేళ్ళపాటు మరొక నవల. ఈసారి మాములు నవల రాశాడు A Missed Beat. దీన్ని వెంటనే ప్రచురించారు. ఇది చాలా పాపులర్ అయింది. డక్కన్ క్రానికల్‌లో ఈ నవల మీద సమీక్షలో కొన్ని వాక్యాలు.

The Writing craft of Subbarao whose father GollapuDi Maruthi Rao, a well Known Telugu author and play wright, in this racy narrative lives up to a rat tace of post colonial society (15-10-2018).

మరి రెండో అబ్బాయి రామకృష్ణ? కొన్నాళ్ళు లెక్చరర్‌గా పనిచేశాడు. చక్కని వ్యాపారి. నేను అప్పుడప్పుడు అంటూంటాను. "నేనూ వ్యాపారినే. కొన్నాళ్ళు ముఖాన్ని నమ్ముకున్నాను. ఇప్పుడు ముఖాన్ని అమ్ముకుంటున్నాను" అని. ఆలోచనని అమ్మడంలో మౌలికమైన లక్షణాలు కలవాడు.

ఇప్పుడు మిత్రుల సందేహాన్ని తీర్చాననుకుంటాను.

**మిత్రులు** రేవూరి అనంత పద్మనాభరావుగారు ఆలిండియా రేడియోలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా రిటైరయిపోయాక తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక అధికారిగా చేరారు. నేను లోగడ చేసిన 'ప్రజావేదిక' ధోరణిలో శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌లో విద్యార్థులతో వారికి సంబంధించిన అంశాలపై చర్చావేదికను ("యువతరంగం") నిర్వహింపజేయాలని నన్ను పిలిపించారు. అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, మరో మిత్రులు కె.వి.రమణాచారిగారు. వారిని కలిశాం. ఆయన వరంగల్లులో లెక్చెరర్‌గా పనిచేసే రోజుల్లో నా నాటిక "దొంగగారొస్తున్నారు, స్వాగతం చెప్పండి"లో ప్రధానపాత్రని పోషించారు. వారితో చర్చముగిశాక పద్మావతి గెస్టు హౌస్‌కి భోజనానికి వచ్చాం. అక్కడ మరో సలహామండలి సమావేశాన్ని ముగించుకుని భోజనానికి ఉపక్రమించే ప్రయత్నంలో ఉన్నారు చాలామంది ప్రముఖులు సి.నారాయణ రెడ్డి, శలాక రఘునాథ శర్మ, కందాడై నరసింహా చార్యులు, మైలవరపు శ్రీనివాసరావు, మేడసాని మోహన్, శివారెడ్డి ప్రభృతులు. మాటల్లో నా 'ఎలిజీ'ల ప్రసక్తి వచ్చింది. వాటిని సినారె 'ఎలజీలు' అనలేదు.

"స్మృతి శకలాలు" అన్నారు సినారె.

కందాడై కల్పించుకుని "ముందు 'లా' చేర్చినా బాగుంటుంది" అన్నారు.

స్మృతి శలాకలు.

మరో సందర్భంలో నాకో కొత్త పేరు పెట్టారు సి.నారాయణ రెడ్డిగారు. ఉన్నపాటున కొత్తమాటని సృష్టించడం ఆయనకి అలవాటు. నేను హైదరాబాదు విమానాశ్రయంలో విమానం ఎక్కడానికి ఎదురుచూస్తున్నాను. సినారె విమానం దిగారు. నన్ను చూస్తూనే దగ్గరికి వచ్చి, నా బుగ్గలు పట్టుకుని "శిశుముఖుడు" అన్నారు.

"మెడ దగ్గరయితే మీ వయస్సు తెలుస్తుంది. కాని ముఖం మాత్రం 'శిశుముఖుడు'."

మా శ్రీనివాస్ మెమోరియల్ ఫౌండేషన్‌కి ప్రసంగానికి (స్మారక ఉపన్యాసం) రావాలని గుర్తుచేశాను. “The Lyrical Excellance in Telugu Film” అన్న విషయం మీద మాట్లాడడానికి అంగీకరించారు. అయితే అనారోగ్యం కారణంగా ఆ ప్రసంగం జరగలేదు.

కొన్ని రచనలు నిత్యనూతనంగా అలరిస్తూనే ఉంటాయి. నా 'కళ్ళు' నాటిక, నా 'తాజ్‌మహల్' కథానిక, నా సాయంకాలమైంది' నవల, నా 'సంసారం చదరంగం' సినిమా ఇలాగ. వీటి జ్ఞాపకాలు జీవితానికి ఆక్సిజన్. ఇప్పటికీ 'కినెగె. కాం' ఇంటర్నెట్ విక్రయ సంస్థ అతి తరుచుగా ఈవారం పాపులర్ పుస్తకం 'సాయంకాలమైంది' అంటూంటారు. ఆ పాపులారిటీని జయించాలని చాలా పరిశోధన జరిపి ఈ మధ్య 'రుణం' నవల రాశాను. మిత్రుడు, రచయిత దివాకర్ బాబు 'ఇది రైటర్స్ నవల' అన్నాడు. 'సాయంకాలమైంది' నవల మీద నాకు కించిత్తు ఈర్ష్య ఉంది.

ఏమయినా కొన్ని స్పందనలు విన్నప్పుడు ప్రాణం లేచి వస్తుంది. *అలా వడబోసిన కొన్ని స్పందనలు:*

2007 మార్చి 19. రాత్రి చాలా ఆవేశంగా ఫోన్ చేశారు రచయిత, కవి భువనచంద్ర సాయంకాలమైంది నవల ఇంకా చదువుతూ. "నేను చెప్పలేకపోతున్నాను. మనస్సుకి భాష ఏదయినా ఉంటే దానితో చెప్పగలను. నేను మిలటరీవాడిని. కన్నీళ్ళు మరిచిపోయాననుకున్నాను. అలాంటిది ఏడ్చాను. పుస్తకం పూర్తిచేసి చేద్దామనుకున్నాను. కానీ వరదమ్మ మృతి తర్వాత ఆగలేకపోయాను. నా తలమీద పెట్టి నమస్కరిస్తున్నాను. లైన్ బై లైన్ చదువుతున్నాను. భగవంతుడు మీకు వెయ్యేళ్ళు ఆయుష్షు ఇవ్వాలి. మరెన్నో మీరు రాయాలి. నవల పూర్తయ్యాక మళ్ళీ ఫోన్ చేస్తాను."

ఇలా ఎందరి మిత్రుల శుభాకాంక్షల వరమో నా ఆయుష్షు.

నవల చదవడం పూర్తిచేసి రాత్రి పదకొండుగంటలకి మళ్ళీ ఫోన్ చేశారు. "ఈ నవల 500 శంకరాభరణాలతో సమానం" అన్నమాట ఆయన ఆనందపూర్ణమయిన ఆవేశం మధ్య వెలువడినది.

ఆనందం కొలమానానికి తూకపురాళ్ళు లేవు. ఈ తరానికి గొప్ప కళాఖండం 'శంకరాభరణం'. ఒక విశ్వనాథ, ఒక 'శంకరరాభరణం' గుర్తుకురావడం ఆ నవల చేసుకున్న పుణ్యం.

కొంచెం దూరమయినా మరొక స్పందన చెప్పాలి. 'కంచె' సినిమా షూటింగు మొదటి రోజే నేను మొదటిసారిగా దర్శకుడు క్రిష్‌ని కలిశాను. మరుసటి షెడ్యూలులోననుకుంటాను. ఆయనకి 'సాయంకాలమైంది' నవల యిచ్చి మరిచిపోయాను. తర్వాతి షెడ్యూలుకి వచ్చి కారవాన్‌లో మేకప్ చేసుకుంటున్నాను. క్రిష్ కారవాన్ తలుపు తీసుకువచ్చి నా చుట్టూ ఉన్న కుర్చీలను దూరంగా జరిపి నా కాళ్ళమీద సాష్టాంగం పడిపోయాడు. "అయ్యా మీరు నవల ఇచ్చాక మూడుసార్లు చదివాను. మీతో మాట్లాడాలని ప్రయత్నించాను. నాకు మాటల్లేవు. సినిమా వాడిని కనుక ఈ నవలని సినిమా చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. కానీ ఇందులో అన్నిపాత్రలు - సుభద్రాచార్యులు, తిరుమలాచార్యులు, వెంకటపతి, ఆఖరికి సాతాని వేషమూ మీరే చెయ్యాలి. మీ 'సైకీ'లోంచి వచ్చిన పాత్రలవి. ఇకముందు మీ చేత ఏం చేయించినా - నాకెలా చేయించాలో తెలుసు" అన్నారు. తమాషా ఏమిటంటే - అటు తర్వాత నేను క్రిష్ సినిమాలో నటించలేదు.

మరొక గొప్ప స్పందన నన్ను బాగా కదిలించింది. లక్ష్మీకాంత శర్మ అనే ఒక ఐటీ టెక్నొక్రాట్ ఫోన్ చేశారు తన్మయత్వంతో. ఆయన పరిచితుడు. నా 'సాయంకాలమైంది' నవలని తిరుపతి వెళ్ళి కొనితెచ్చుకున్నాడట. వరంగల్లు దగ్గర కాళేశ్వరం అనే గ్రామంలో అతని తండ్రి అర్చకుడు. నవల చదివాక తల్లిదండ్రులతో ఉండాలని విదేశాలలో ఉద్యోగాలు వచ్చినా వదులుకుని ఇండియాలో ఉండిపోయాడు "మిమ్మల్ని వచ్చి కలుస్తాను సార్" అన్నాడు.

పొట్టి శ్రీరాములు హాలులో 53వ ఆంధ్రప్రదేశ్ అవతరణ సభ. పోలీసు కమీషనర్ ఆర్. శేఖర్ ముఖ్య అతిథి. నేను ప్రత్యేక అతిథిని.

మాలతీ చందూర్ సభ మొదలుపెట్టే ముందు నావేపు వొంగి "మీరు సోబర్ అయిపోయింది ఎప్పట్నుంచీ?" అన్నారు.

సమాధానానికి తడువుకోలేదు. "వాసూ పోయినప్పట్నుంచీ" అన్నాను. అర్థమయినట్టు తలూపారు.

తర్వాత కవిసమ్మేళనంలో నేను అమెరికా వెళ్ళినప్పుడు ఒకానొక విమాన ప్రయాణంలో రాసిన 'అమెరికా పాటలు' చదివాను. ఆడియన్స్ ఉర్రూతలూగిపోయారు. మాలతీచందూర్ లేచివచ్చి నా చేతిలో కవిత లాక్కుని ఎన్.ఆర్ చందూర్‌కి ఇచ్చారు - 'జగతి'లో వేస్తారని.

'జగతి' చరిత్రలో ఎడిటర్‌గారి ప్రమేయం లేకుండా ఆమె ఎంపికచేసిన రచన అదొక్కటేనేమో.

**కొన్ని** దశాబ్దాలుగా ఆయా పత్రికలలో సాగుతున్న 'జీవనకాలమ్' మీద కొన్ని స్పందనల పాలపొంగు. ఎప్పటికప్పుడు రుచి చూడకపోతే పాలు విరిగిపోతాయి.

సాధారణంగా కాలమ్ రచన పూర్తిచేశాక ఒక స్పందన కోసం కొందరికి, అందరికీ అన్నిసార్లూ కాదు, ఫోన్‌లో చదివి వినిపించడం ఆనవాయితీ. దశాబ్దాలపాటు న్యూస్ ఎడిటర్‌గా 'హిందూ'లో పనిచేసిన బులుసు ప్రభాకర శర్మగారికి, మిత్రులు వెన్నెలకంటిగారికి, గుంటూరు లక్ష్మీనారాయణగారికి, ఒక్కోసారి కిరణ్‌ప్రభకి - ఇలాగ.

"కారణజన్ములు" కాలమ్ డాక్టర్ పప్పు వేణుగోపాలరావుగారికి చదివి వినిపించాను. "వండ్రఫుల్ మారుతీరావుగారూ ఒక్క గొంతు ఎత్తినా అది ఓంకారమవొచ్చు. తరువాత నాదంలోంచి నినాదం పుట్టొచ్చు" అన్నారు.

ఇక్కడో చిన్న పిట్టకథ. నేను కాలమ్ రాయను. పద్యంలాగా కంపోజ్ చేస్తాను. అందులో ఒక్క అక్షరం మారినా ఆరునెలలయినా గుర్తుపట్టగలను. అంతేకాదు. ఆ మార్పు నన్ను విపరీతంగా బాధపెడుతుంది. ఇప్పుడీ "కారణజన్ములు" కాలమ్‌లో ఒక వాక్యాన్ని తీసేశారు ఎడిటోరియల్ విభాగంవారు.

ఈ కాలమ్ వ్యవహారాలు కల్లూరి భాస్కరంగారనే ఉప సంపాదకులు చూస్తున్నారు. ఆ సవరణ చూడగానే నెత్తికి రక్తం ఎగదన్నింది. వెంటనే ఫోన్ చేశాను. ఇవీ నా మాటలు: "ఒక పక్క సిగ్గులేకుండా ఓ రాష్ట్రం హంతకునికి (J&K) మద్దతు యిస్తూంటే దాన్ని చెప్పడానికి ఇంకా వెనకాడే మన బలహీనత ఈ దేశపు అనర్థం. You have taken away the teeth from my column. ఇలాంటి జర్నలిజం కన్నా కిళ్ళీకొట్టు పెట్టుకోవడం నయం."

చెప్పేది పత్రికలో పనిచేస్తున్న వ్యక్తికి. చెప్తున్నది ఆవేశంతో. భాస్కరంగారు పెద్దమనిషి. ఆయన అర్థం చేసుకున్నారు. కిమ్మనలేదు. అయినా జరగాల్సిన అనర్థం ఎలానూ జరిగిపోయింది.

ఎలిజీలు కూడా నా కాలమ్‌లో భాగమే. మద్రాసులో జరిగిన తెలుగు మహాసభల కార్యవర్గ సమావేశంలో మాలతీచందూరుగారు కలిశారు. "ఎలిజీలు చదివాను. ఎంత బాగున్నాయో? ఎందరో ఆత్మీయులను తలుచుకున్నాను. నేనుపోతే ఎంత మంచి ఎలిజీ రాస్తారో అనుకున్నాను". ఆవిడ పోయాక నిజంగా ఆత్మీయంగా రాశాను.

పి.ఆర్.స్వామి "గొల్లపూడి రచయితల్లో పూలపుప్పొడి" అన్నారు.

నా కాలమ్ రచనలో "The Slum dog Millionnaire" మీద నేను రాసిన కాలమ్‌ని వ్యతిరేకిస్తూ ఎందరో పత్రికల్లోనే రాశారు. సినీమా ఎంత గొప్పగా ఉన్నా మన దేశాన్ని అంత హీనంగా, పేదగా, దయనీయంగా చూపడం నాకు బొత్తిగా నచ్చలేదు. ఆ విషయాన్నే నిర్దుష్టంగా, కుండబద్దలు కొట్టినట్టు రాశాను. (తీరా ఆ సినిమాకు కొన్ని ఆస్కార్ బహుమతులు వచ్చాయి. ఎందుకు రావు? ఇండియా ఇంకా అడుక్కునే, నేలబారు దశలోనే ఉన్నదని భావించేవారు, భావించి చంకలు గుద్దుకునేవారు ప్రపంచంలో చాలామంది ఉన్నారు.)

నా కాలమ్ మీద ఒక్క వ్యక్తి స్పందన నాకు బాగా గుర్తుండిపోయింది. మా పెద్దబ్బాయి. "చాలా గొప్పగా ఉంది. కిట్టప్ప చేత ఇంగ్లీషులో రాయిస్తాను. ఇది కాలమ్ కాదు. థీసిస్."You deserve a doctorate for this అంటూ మరొక మాట అన్నాడు: "I may or may not get an opportunity to say this, I would like to be born as your son again."

అన్నది కొడుకు కనుక ఇందులో 98శాతం మినహాయించినా కాలమ్ మీద వ్యామోహం ఈ వాక్యాలను ఇక్కడ ఉటకింపజేసింది.

టేకుమళ్ళ వెంకటప్పయ్య అనే పాఠకుడు ఒక పద్యం రాశాడు:

**రచనయందు మరి నవరసములందు**
**ఆరి తేరెను మారుది ఆది నుండి**
**యెడద పొంగగ, చదువగ యెవరికైన**
**గొల్లపూడి శైలి మదిని కొల్లగొనియె**

సాక్షిలో నా కాలమ్ "అమ్మ" చదివి మధురాంతకం నరేంద్ర ఫోన్: "సార్ ఈ రోజు కాలమ్ నన్ను గురించి రాసినట్టుంది సార్. ఒక్క అక్షరం కూడా అదనంగా కానీ, తక్కువగానీ లేకుండా రాశారు సార్. మా నాన్నని జ్ఞాపకం చేశారు"

సాక్షి కాలమ్‌కి ఫోటో కోసం మల్లాది నరసింహశాస్త్రిగారికి (మల్లాది రామకృష్ణశాస్త్రిగారబ్బాయి) ఫోన్ చేశాను. ఆయనా నేనూ ఆలిండియా రేడియోలో కలిసి పనిచేశాం. కలిసి హైదరాబాదులో "కళావని" అనే సంస్థని నిర్వహించాం. ఆ రోజుల్లో అనితర సాధ్యమైన రీతిలో 'తెలుగు నాటకరంగం' మీద వంద వ్యాసాల అపురూపమయిన గ్రంథాన్ని వెలువరించాం. శాస్త్రిగారు ఫోన్‌లో అన్నారు: "ఈ మధ్య మా నాన్నగారివి కొన్ని స్క్రిప్ట్స్ చేతికొచ్చాయి. మీరు చూస్తే ఆనందిస్తారు. మీకు కొన్ని అప్పగించాలి. ఎన్నిరోజులుంటామో తెలీదు. ఇలాగ కొందరం మిగిలాం. ఆలశ్యం చెయ్యకుండా మీరు ఒకపూట మాతో గడిపేటట్టు రండి. చాలా చూపించాలి. చాలా మాట్లాడుకోవాలి"

ఇంతవరకు ప్రశంసలతో ఊదరగొట్టేస్తున్నానని పాఠకులు భావించవచ్చు. దానికి చాలా కారణాలున్నాయి. నా వయస్సు, సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని నాతో ఏకీభవించనివారు బహుశ నాకు ఉత్తరాలు రాయరు. నన్ను విమర్శించే ఉత్తరాలు బొత్తిగా నాకు చేరవు. అలాంటి ఒక అరుదయిన ఉత్తరాన్ని ఇక్కడ ఉటకించాలి.

ఒక మహాకవి, పండితుడూ అయిన వ్యక్తిని ప్రశంసిస్తూ కాలమ్ రాశాను. అన్ని విధాలా ఆ ప్రశంసకు ఆయన అర్హుడు. సందేహంలేదు. నెల్లూరునుంచి యద్దనపూడి రాజేశ్వరరావు అనే ఆయన ఒక పోస్టుకార్డు రాశారు. ఆ పండితుని నిర్వాకాన్ని గురించి విపులగా వివరించి "ఫన్‌డే ఆదివారం సంచికలో వస్తున్న డైరీ - మనస్సాక్షి బోరింగుగా ఉంది. తమకు 70 సంవత్సరాలు వచ్చాయి. ఈ చెత్త రాతలు మాని ఆధ్యాత్మిక జీవనం సాగిస్తే మంచిది. ఫన్‌డేలో వస్తున్న మీ గొప్పలు ఎవరికి కావాలి?" ఈ విమర్శ నాకు చేరిన అరుదైన కార్డు.

"ప్రేమ" నన్ను ఎక్కువగా పురికొల్పి కవితవేపు తరుముతుంది. ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంలో పనిచేసే రోజుల్లో ఓ ఆంగ్లో ఇండియన్ అమ్మాయికి తెలుగు రచయిత గొప్పతనం చెప్పడం ఎలా? ప్రయత్నించి ఇంగ్లీషులో కవిత్వం వ్రాయడం పరిశ్రమ చేసి పుంఖాను పుంఖంగా రాశాను.

నా డైరీలో 2008 డిసెంబరు 25 రాత్రి శ్రీదేవి అనే అమ్మాయి ఫోన్ చేసింది రోజూ నాతో పదినిముషాలు మాట్లాడాలని షరతు. పదినిముషాల్లో ఫోన్ చేయమంది. నేను చేయలేదు. మళ్ళీ తనే చేసింది. వెంటనే అప్పటికప్పుడు రాసిన గేయం చదివి వినిపించాను.

**ఆలోచల్ని పదిలంగా**
**మడత పెడితే నిద్రవుతుంది.**
**కోరికల్ని రహస్యంగా**
**మడత విప్పితే కలవుతుంది**
**నువ్వు నా నిద్రలో కలవి -**
**కలకోసం ఎదురుచూసే నిద్రవి**

శ్రీదేవి థ్రిల్ అయింది. ఇదీ ఎంట్రీ.

మరో పదినిముషాలకి ఈసారి నేను ఫోన్ చేశాను - కవిత చదవడానికి.

**ఒంటరితనం ఆలోచనల్ని**
**అలంకరించుకుంటుంది -**

**ఆలోచనలు అవసరాల**

**రెక్కలు చాస్తాయి**

**ఏకాంతం దిక్కులు చూస్తుంది**

**నరాలమీద వరాల రాగాల్ని సంధిస్తుంది**

**కోరిక దొంగ పేరు 'స్నేహం'**

ఇంతకీ ఎవరీ శ్రీదేవి? అటు తర్వాత ఎప్పుడూ జీవితంలో తారసపడిన గుర్తులేదు. మా సఖ్యత - ఒక సాయంకాలం - నాలుగు ఫోన్ కాల్స్ వయస్సు.

**"బి.ఎన్.రెడ్డి జీవితం, కృషి"** అనే విషయం మీద పుస్తకాన్ని రాస్తున్నప్పుడు పూనా ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ నుంచి కొంత సమాచారం కావలసి వచ్చింది. ఎవరు పరిచయం చేశారో గుర్తులేదుకాని అక్కడ చాలాకాలంగా పనిచేస్తున్న ఒక తెలుగాయన్ని పరిచయం చేస్తూ ఆయన ఫోన్ నంబరు ఇచ్చారు. సముద్రాల రఘునాథ్ పేరులోనే తెలుస్తున్నట్టు ప్రముఖ కవి సముద్రాలగారి మనుమడు. ఆయన నాకు చాలా సహకరించారు. ఆ సందర్భంలో పూనా ఫిలిం ఇన్స్టిట్యూట్‌లో జరిగిన ఒక సెమినార్‌లో నేనూ పాల్గొనడానికి నాకు ఆహ్వానం అందింది. రఘునాథ్‌గారు పూనుకోకపోతే నా గురించి అక్కడ ఎవరికయినా తెలుస్తుందనుకోను.

దక్షిణాదినుంచి బొత్తిగా ప్రమేయం లేనిది 'తెలుగు' పరిశ్రమ అని నాకనిపిస్తుంది. మళయాళం నుంచి అరవిందన్, ఎమ్.టి వాసుదేవన్ నాయర్, అదూర్ గోపాలకృష్ణన్ ఇలా చాలామంది తెలుసు. ఇక తమిళంలో కె. బాలచందర్, మణిరత్నం, సేతుమాధవన్ - ఇలా కొందరు తెలుసు. కానీ నాకు తెలిసి తెలుగువారి ప్రాచుర్యం తక్కువ. కమర్షియల్ సినిమాలో పాపులర్‌గా ఉన్న దాసరి, రాఘువేంద్రరావు, తాతినేని రామారావు పేర్లు అక్కడ వినిపించవు. 'శంకరాభరణం' తర్వాత కె.విశ్వనాధ్ తెలుగు జెండాని ఎగరవేశారు. ముఖ్యకారణం వారి భాష హిందీ. ఇనిస్టిట్యూట్‌లో చదువుతున్న చాలామంది ముంబై, ఇతర ఉత్తరదేశపు ప్రాంతాలనుంచి వచ్చినవారు కావడం. ఇదేకాని కాకినాడలో ఉంటే పరిస్థితి వేరుగా ఉండదేమో? పూనా ఫిలిం విద్యార్థిలోకానికి దక్షిణాది సినిమా ప్రముఖుల పేర్లు కూడా తెలీవేమో. 'ఆర్టు' అంటే బొత్తిగా అంటరానివారని నా ఉద్దేశం కాదు. కానీ పూనాలో ఇప్పుడిప్పుడు బొంబాయిలో విజృంభిస్తున్న కమర్షియల్ దర్శకులు, హీరోల ప్రాభవం తెలుస్తుంది. కాగా భాషకూడా ప్రధానమయిన కారణం.

కాగా, ఈ సెమినార్‌కి నాకు ఆహ్వానం రావడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. రఘునాధ్‌గారు ఫోన్ చేసి రెచ్చగొట్టారు. 'మనమేమిటో వీళ్ళకి చెప్పండి' అంటూ.

ఇలాంటి అవకాశమే అపురూపం. కాగా, ఫిలిం ఇన్స్‌టిట్యూట్ చూడాలనే వ్యామోహం, అంతకు మించి పక్కనే ఉన్న షిరిడీ యాత్ర - ఇవన్నీ ఆకర్షించాయి.

సెమినార్‌లో నా ప్రసంగ విషయం: Mythology in Indian Film.

బహుశా ఎవరూ ముట్టుకోని విషయమేమో. ఈ రోజుల్లో పురాణాలు, దేవుళ్ళూ ఎవరికి కావాలి? ఆ తరం - హిందీ పరిశ్రమలో గడిచిపోయింది. అందరికీ అన్నీ వడపోయగా మిగిలిన 'జిడ్డు' ఈ శీర్షిక అనుకుంటాను.

కానీ నాకు మొదటి అవకాశం. తీరికగా కూర్చుని అద్భుతమయిన ప్రసంగాన్ని సిద్ధం చేశాను. చేస్తూనే మిత్రులు డాక్టర్ పప్పు వేణుగోపాలరావుగారికి పంపించాను. వెంటనే నాకందిన ఆయన స్పందన. "ఎంత బాగా రాశారు. I am honoured to read it in Thaliland!"

ఇప్పుడు ఫిలిం ఇన్స్‌టిట్యూట్ ఒకప్పుడు ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు వి.శాంతారాం రాజ్ కమల్ స్టూడియోస్. ఆ స్టూడియోలో నడుస్తున్నంత సేపూ ఎన్ని జ్ఞాపకాలో. ఎన్ని అపూర్వమైన చిత్రాలకు అది పుట్టినిల్లు. నేనూ మా ఆవిడా ఒక మైకంతో నడిచాం. మా పక్కన రఘునాథ్.

ఇక సెమినార్ ఒక పెద్ద సర్కస్. భారతదేశంలోని ఎందరో ప్రముఖులు అక్కడ దర్శనమిచ్చారు. హాజరయిన విద్యార్థులకీ అదొక అపూర్వమైన అవకాశం అనుకుంటాను. అయితే ఈ 'గొల్లపూడి మారుతీరావు' ఎవరో ఎవరికీ తెలియదు. ఏ ఒకరిద్దరో పొరపాటున తెలుగు సినిమా తెలిసినవారు తప్ప ఎవరూ నా వేపు కన్నెత్తయినా చూడలేదు. ఈ సెమినార్ అధ్యక్షులు ప్రముఖ రచయిత, కన్నడ సీనియర్ సినీ నిర్మాత యు.ఆర్. అనంతమూర్తిగారిని పలకరించాను. ఆయన మా ఫౌండేషన్ సభలకి వచ్చారు. The Moral fatigue in Indian Cinema అనే విషయం మీద అద్భుతమయిన "శ్రీనివాస్ స్మారక" ప్రసంగాన్ని చేశారు. ఆ సందర్భం వారికి బాగా గుర్తుంది. హార్థికంగా పలకరించారు. జావేద్ అఖ్తర్‌ని పలకరించాను. భయం భయంగానే. మా ఫౌండేషన్‌కి రావడం గుర్తుందన్నారు. అమ్మయ్య బతికాను. గుల్జార్ ఒకప్పుడు అప్పుడెప్పుడో మహాబలిపురంలో నిర్మాత మల్లిఖార్జున రావుగారికి 'కళ్ళు' కథ చెప్పాను. గుర్తుందన్నారు. మొహమాటానికా? గోవింద నిహలానీ మా సభలకి వచ్చారు. ఒకసారి జ్యూరీ సభ్యులుగా ఉన్నారు. గుర్తుపట్టారు. ఇంతే పరిచయాలు.

నేను ప్రసంగించే సభకి కమల్‌హాసన్ అధ్యక్షత. మరో ప్రసంగం డాక్టర్ దేవ్‌దత్తా పట్నాయక్ అనే ఆయనది. ఆయన పౌరాణిక విషయాల మీద ఎన్నో పుస్తకాలు రాశారు. ఈ ప్రాంతాలలో ఆయన పాపులర్ అనుకుంటాను. కమల్ విమానం దిగుతూనే అతుల్ తివారీ అనే రచయిత, కార్యకర్తతో అన్నారట. "నాకు వేరే గది అక్కరలేదు. మారుతీరావుతో ఉంటాను" అని. తీరా నా భార్య వచ్చిందంటే గది తీసుకున్నారు.

మధ్యాహ్నం నా సభ. నేను performerని. లేని నిలబడి మైకు దగ్గరికి నడిచాను. తరువాత ఒక అరగంటసేపు ప్రేక్షకుల ఊపిరి తిరగనివ్వలేదు. పామర భాషలో చెప్పాలంటే అదరగొట్టేశాను. అందరూ నిర్ఘాంతపోయి నా ప్రసంగాన్ని విన్నారు. నా అనుభవంలో ప్రేక్షకులు నా చేతిలో ఉన్నారన్న విషయాన్ని గ్రహించడం కష్టంకాదు. ప్రసంగం పెద్ద హిట్. నా తరువాత కమల్ హాసన్ అనే అధ్యక్షుడు నాస్తికుడు. భారతీయ సినిమాలో పౌరాణిక ఇతివృత్తం గురించి, మిత్రుడినయిన నా గురించి క్లుప్తంగా మాట్లాడాడు. నా తర్వాత దేవదత్తా పట్నాయిక్ ఏవో చార్టులు, బొమ్మల ప్రదర్శనతో ప్రసంగించాడు. సభ అయ్యాక నేను రెండు అంగుళాలు ఎత్తున నడిచాను. విద్యార్థులు కొందరు కొత్తగా చూశారు. ఫిలిం ఇన్స్‌టిట్యూట్‌లో చేరడమే సినీ రంగానికి పాస్‌పోర్ట్‌లాగా గిరజాల జుత్తులతో, రకరకాల దుస్తులతో విచిత్రమైన రకరకాల కళ్ళద్దాలతో, షోకులతో దర్శనమిస్తున్న కొందరికి ఈ ప్రసంగాలు 'గగన కుసుమాలు' అనుకుంటాను.

విచిత్రమేమిటంటే నాలాగా, దేవ్‌దత్తా పట్నాయిక్‌లాగా మిగతా వ్యక్తులు సిద్ధపడినట్టు అనిపించలేదు. లేక మానసికంగా 'హోం వర్క్' చేసుకుని వచ్చారో జావేద్ అఖ్తర్ అలవోకగా, అనర్గళంగా మాట్లాడారు. నేనూ అంతకంటే అనర్గళంగా మాట్లాడగలను. మర్నాడు సంజయ్ లీలా బన్సాలీ వచ్చారు ముంబై నుంచి. ఆయన పెద్ద ఆకర్షణ. ఈ కుర్రాళ్ళకి అతను పెద్ద గమ్యం. పూనాలో ఆయన తెలుగు దాసరి. అతని కళ్ళల్లో పడాలి అన్న కుర్రాళ్ళ తపన కనిపించింది. ఆయన గొంతు విప్పితే చప్పట్లు కొడుతున్నారు. అతను ఆడుతూ పాడుతూ మాట్లాడారు. ఆయన మాటలకి ప్రేక్షకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొత్తం మీద 'హిందీ' రాజ్యమేలే ప్రాంతంలో హిందీ కళాకారుల, టెక్నీషియన్ల హవా చెల్లుబాటయింది. రఘునాథ్ కూడా ఈ విషయాన్ని ముందుగానే సూచించారు.

ఏమయినా వచ్చినపని మర్యాదగా, బాధ్యత చేసిన తృప్తినాది.

ఆ సాయంకాలం స్టూడియో వెనుక నున్న చెట్ల గుబుర్ల మధ్య ఖాళీ స్థలంలో ఇన్స్టిట్యూట్ విద్యార్థులు షేక్స్‌పియర్ "మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్" నాటకాన్ని ప్రదర్శించారు. ప్రదర్శన చాలా బాగుంది. మా పక్కన యు.ఆర్ అనంతమూర్తిగారు. నా ప్రసంగాన్ని ఆయన చాలాబాగా మెచ్చుకున్నారు.

"నాకు మీ ఆశీర్వాదం కావాలి" అన్నాను.

"నేను మీకంటే పెద్దవాడిని. ఐ యామ్ డూయింగ్ జస్ట్ దట్" అన్నారు.

శివానీని పరిచయం చేశాను. ఆయన లోగడ మా ఫౌండేషన్ సభకి వచ్చారు కనుక నేపథ్యం తెలుసు. ఆమె రెండూ చేతులూ పట్టుకుని “You are a great mother. కొడుకు పోయిన దుఃఖాన్ని మనస్సులోనే పెట్టుకుని మంచిపని చేస్తున్నావు" అన్నారు.

"I am no great mother. But my son made me great” అంది శివాని. బహుశా ఆమె జీవితంలో అంత గొప్ప స్పందన వ్యక్తం చేయడం అదేనేమో?

మరునాడు ఉదయం కమల్ హాసన్ నా హోటల్ గదికి వచ్చారు. ముందు రోజు నా కీ నోట్ అడ్రస్ బాగుందన్నారు. కమల్ నాస్తికుడు. నా ప్రసంగం పౌరాణిక చిత్రాల మీద. బాగున్నది ప్రసంగం మాత్రం. జబ్బార్ పటేల్ అనే దర్శకులు, ముంబైలో ఒకే కేంద్రాన్ని నడుపుతున్న అంజాన్ రాజబలీ అనే రచయితా నా ప్రసంగాన్ని మెచ్చుకున్నారు. గుల్జార్, అతుల్ తివారీ లిఫ్టులో కలిశారు. వాళ్ళిద్దరు కూడా నా ప్రసంగాన్ని మెచ్చుకున్నారు. “My audience is very illustrated and a rare one. When will I get a chance like this” అన్నాను. పనిలో పని గుల్జార్ గారిని ఫౌండేషన్ సభకి ఆహ్వానించాను. కానీ ఆగష్టు నెలలో ఆ తేదీలలో ఆయన పుట్టినరోజో, మరేదో ఉంది. ఏ సంవత్సరమూ వీలుపడదని తేలింది. ఆ విధంగా శ్రీనివాస్ ఫౌండేషన్ గుల్జార్‌ని నష్టపోయింది.

**సరిగ్గా రెండు** నెలలకి చెన్నైలో ఒక వర్కుషాప్‌ని కమల్ హాసన్ ప్లాన్ చేశారు. ఆగష్టు 12 శ్రీనివాస్ ఫౌండేషన్ సభకి శృతిహాసన్‌ని సంధానకర్తగా కావాలని ఫోన్ చేసి అడిగాడు సుబ్బారావు. రాత్రి 8గంటలకి కమల్ ఫోన్ చేశాడు. "నేను మరిచిపోయాను. నాదే తప్పు. క్షమించండి. ఈ నెలాఖరున చెన్నైలో జరిగే స్క్రీన్‌ప్లే వర్క్‌షాప్‌లో మీరు మాట్లాడాలి. ప్లీజ్ యాక్సెప్ట్ మై ఇన్విటేషన్" అన్నాడు.

"ఏం మాట్లాడాలి?"

"అది మీకు నేను చెప్పాలా? మీరేం మాట్లాడితే అది" అన్నాడు.

"అలాక్కాదు. ఏ విషయం, ఎంత వ్యవధి - యివన్నీ తెలిస్తే పేపర్ రాస్తాను"

"ప్రసాద్ ఇనిస్టిట్యూట్ హరిహరన్ చేత ఫోన్ చేయిస్తాను" అన్నాడు.

మొత్తం మీద “The unprofessional professional’s screen writing” అనే శీర్షికని నేనే నిర్ణయించుకున్నాను. ఈసారి ఆడియన్స్‌లో రితుపర్ణ ఘోష్, శేఖర్ కపూర్, అతుల్ తివారీ, అంజన్ రాజబలి, వీరంతాకాక చెన్నైలో సభ కనుక ఏ కాస్తో నన్ను తెలిసిన విద్యార్థులూ ఉన్నారు. ప్రసంగం బాగా రక్తికట్టింది. ప్రేక్షకుల్లో కొందరు ప్రశ్నలు కూడా సంధించారు. పూనా అనుభవం తర్వాత ఈ సెమినార్‌కి ఐదు మార్కులు ఎక్కువ. ఇంతకూ కమల్ హాసన్ సంతోషపడ్డాడు.

ఆ తర్వాత? దక్షిణాది వారికి అక్కడ ప్రవేశం తక్కువ. హిందీ తెలిసిన, ఒక్క సినిమాతో ‘ఆర్టు‘ సినిమా తీశామని భావించేవారికి ప్రవేశం ఎక్కువ. ఆ తర్వాత ఒకటి రెండు ఆహ్వానాలు ప్రసంగాలకి ఆహ్వానిస్తూ వచ్చిన గుర్తు. కానీ మనసు అటుపోలేదు. పదిమంది తెలిసిన ప్రేక్షకులు నలుగురు అతుల్ తివారీలపెట్టు.

అటు తర్వాతకూడా ఒకటి రెండు సందర్భాలలో మిత్రులు, దర్శకులు టి.ఎల్.వి ప్రసాద్ గారి ద్వారా కె.సి.బొకాడియా నా చేత దర్శకత్వం వహించాలని ఊగినా మనస్సు అటుపోలేదు. తెలిసిన ప్రపంచంలో రాణింపు, తెలియని పరిశ్రమలో తలదూర్చడం కన్నా గొప్పదనిపించింది. కాగా అప్పటికే 'స్టార్' రచయితగా చెలామణీ అవుతున్న నేను అక్కడ కొత్త వాతావరణంలో ఓనమాలు దిద్దడం రుచించలేదు. నటులు, నటీమణులూ భాష ఎల్లలను దాటి రావడం సుళువు. ఖాదర్ ఖాన్, జావేద్ అఖ్తర్, గుల్జార్ తెలుగులో వ్రాయడం దుస్తరం.

టెలిఫోన్‌లో రకరకాల విన్యాసాలు చేసేవారంటే నాకు చాలా చాలా చిరాకు. కారణం. సాధారణంగా నాకు ఫోన్ చేసేవారిలో సగం మంది నాకు తెలియనివారు తీరా 'నేనెవరో చెప్పుకోండి చూద్దాం' అనే దిక్కుమాలిన ప్రశ్నకి మనకి తెలిసిన వేలాదిమందిలో ఈ గొంతుని వెదుక్కోవడం అదిన్నీ అప్పుడు ఉన్న పరిస్థితిలో చాలా దుర్మార్గమయిన జోక్. నా వయస్సునీ, పెద్దరికాన్ని గౌరవించే వ్యక్తి ముందుగా తనెవరో చెప్పడం అతి సౌకర్యం. కాగా సమంజసం.

మొబైల్ చాలా దుర్మార్గమైన పరికరం. అదాటుగా ఫోన్ మోగినప్పుడు మనం కడుపునొప్పితో బాధపడుతున్నామా? ఇల్లాలితో తగాదా పడుతున్నామా? అప్పులవాడు నెత్తిమీద కుర్చున్నాడా? కొడుకుని సాగదీస్తున్నారా? పొరుగింటాయన మీ మామిడిచెట్టు కొమ్మలు నరికాడా? ఇలా వంద రకాల సమస్యలు ఉండవచ్చు. మొబైల్ హఠాత్తుగా మీతో కనెక్టు అవుతుంది కనుక. ఫోన్ చెయ్యగానే హింసించకుండా మాట్లాడేదెవరో చెప్పడం మర్యాద. నా వయస్సుకీ, పెద్దరికానికీ గౌరవాన్నిస్తున్నట్టు.

అయితే అలా నన్ను ఇబ్బంది పెట్టిన ఇద్దరు ప్రముఖ వ్యక్తుల టెలిఫోన్ కాల్స్‌ని మరిచిపోలేను. చాలా బిజీగానో, మరేదో పనిలోనో ఉన్నప్పుడు మొబైల్ మోగింది. అటునుంచి గొంతు. "నేనెవరో చెప్పుకోండి చూద్దాం" అంతే. అలాంటి సందర్భాలలో మరో ఆలోచనలేకుండా, అతి క్రూరంగా ఆ కాల్‌ని ఆపేస్తాను. అంతేకాదు. ఆ నంబరు గుర్తుంచుకుని ఆ రోజంతా ఆ నంబరు కాల్‌ని తీసుకోను. ఆ క్షణంలో అదే చేశాను. సరిగ్గా రెండు నిముషాల్లో మళ్ళీ ఆ నంబరునుంచి ఫోన్. నా పద్ధతి ప్రకారం కాల్‌ని తీయలేదు. రెండుసార్లు. మూడుసార్లు. కనీసం అరగంట గడిచాక పదే పదే చేస్తున్న ఆ వ్యక్తికాల్ ని తీసుకున్నాను. అటునుంచి కంగారుగా మాట: "ఫోన్ పెట్టెయ్యకయ్యా బాబూ. నేను విశ్వనాథ్‌ని" అని. మిత్రులు కె.విశ్వనాధ్‌గారికి నా పాఠం ఎలా చెప్పను?

మరొక ఫోన్ జోక్. మరో గొప్పమిత్రులు, ప్రముఖులద్వారా.

పరాకుగా ఉన్న నాకు ఒక ఫోన్‌కాల్ వచ్చింది. అటునుంచి "నేను మీ అభిమానిని, మిత్రుడిని, శ్రేయోభిలాషిని" ఇదీ ఆ పలకరింత.

వెంటనే గొంతుని గుర్తుపట్టలేకపోయాను. "ఎవరూ?" అన్నాను.

మళ్ళీ అవే మాటలు: "నేను మీ అభిమానిని, మిత్రుడిని శ్రేయోభిలాషిని"

ఒకటి రెండుసార్లు ఈ మాటలు విన్నాక విసిగి మొబైల్‌ని ఆపుజేశాను.

ఓ గంట తర్వాత ఈ 'అభిమాని' అలిసిపోయాడనుకుంటూ మళ్ళీ మొబైల్‌ని ఆన్ చేశాను. ఒక మెసేజ్ వచ్చివుంది. "నేను గుమ్మడిని. మీకు నేను స్నేహితుడినయితే ఫోన్ చెయ్యండి" అని. తుళ్ళిపడ్డాను. రెండుసార్లూ నాలిక కొరుక్కుని లెంపలు వేసుకున్నాను.

వెంటనే ఫోన్ చేశాను. ఆస్ట్రేలియా తెలుగు సంఘం (మెల్బోర్న్) వారు గుమ్మడిగారికి సన్మానం చెయ్యడానికి ఆహ్వానించారు. ఈయనకి బొత్తిగా ఆరోగ్యం బాగోలేదు. "మీరు వస్తానంటే నేను ఒప్పుకుంటాను. "మీరు వస్తేనే నేను వస్తానన్నాను శ్రీనివాసరావుతో" అన్నారు.

లోగడ నేనూ మా ఆవిడా ఆస్ట్రేలియా వెళ్ళాం. అయిన ఈ ఆహ్వానాన్ని అంగీకరించాను. అయితే అన్ని ఏర్పాట్లూ జరిగాక 14రోజుల తర్వాత గుమ్మడి ఫోన్ చేశారు "పదిరోజుల తర్వాత ఇప్పుడే ఆసుపత్రినుంచి వస్తున్నాను. మీ అందరి ఆశీర్వాదం వల్ల బతికాను. ఇప్పుడున్న పరిస్థితుల్లో అస్సలు రాలేను. నా తరఫున మీరే ఆ విషయం అక్కడివారికి చెప్పండి" అన్నారు.

మెల్బోర్న్‌లో గుమ్మడిగారికి పరోక్షంగా సన్మానం జరిగింది. తరువాత శ్రీనివాసరావు దంపతులు హైదరాబాదు వచ్చి అక్కినేని, సినారె, కైకాల సమక్షంలో వారికి ఆ సత్కారాన్ని అందజేశారు.

మెల్బోర్న్‌లో గుమ్మడిగారి గురించి చెప్పాక ప్రేక్షకులతో 'ముఖాముఖీ' నిర్వహించాను. బాగా సాగింది. శ్రీనివాసరావుగారు ఆ టేపుని గుమ్మడిగారికి పంపారు. ఆ టేపుని ఒకటికి రెండుసార్లు విని గుమ్మడిగారు ఫోన్ చేశారు "మెల్బోర్న్ టేపు చూస్తున్నాను. మీ ప్రసంగం అద్భుతం. మీకు సాటిలేరు. 24 సంవత్సరాల కిందట మారుతీరావుగారి ఘనతని మళ్ళీ చూస్తున్నాను"

ఇవన్నీ భుజాలు పొంగే కితాబులు కావు. ఆత్మీయుల స్పందనలు.

**కాలం గడిచినా** కాలదోషం పట్టని కొన్ని సంఘటనల్ని ఇలాంటప్పుడయినా గుర్తుకు తెచ్చుకోవడం సమంజసం.

నేను ఆంధ్రప్రభ చిత్తూరు విభాగంలో పనిచేసే రోజుల్లో పచ్చగా నిలిచిన జ్ఞాపకం, ఎప్పుడూ గుర్తుకు వచ్చే ఆత్మీయతా తెలుగు దేశానికి 'జాతీయగీతం' అనదగ్గ గీతాన్ని రచించిన శంకరంబాడి సుందరాచారి పరిచయం. అతి తరుచుగా చిత్తూరు వచ్చి మాతో గడిపి వెళ్ళేవారు.

మనిషి వెన్నముద్ద. కానీ పట్టుదలకి వస్తే గొప్ప అహంకారి, మొదట్నుంచీ స్వేచ్ఛాయుత జీవి. చిన్నతనంలోనే ఇంటినుంచి బయటకు వచ్చేసి రైల్వే కళాసీగా, బస్సు స్టాండులో కూలీగా, హోటల్లో సర్వర్‌గా పనిచేసి పొట్టనింపుకున్నారుగాని ఒకరిని ఆశ్రయించినవారు కాదు. ఏ రోజుకారోజు గడవడమేకాని పైసా మిగుల్చుకోవడం తెలీని మనిషి. కళకి ప్రాణం యిచ్చే ఉదాత్తుడు. మేం చిత్తూరులో ఉన్న రోజుల్లోనే చేతిలో పైసా నిలవని ఈ కవీంద్రుడు ఆనాటి ప్రముఖ విద్వాంసులు, తిరుపతి సంగీత కళాశాల ప్రిన్సిపాలు అయిన చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్ళేకి చిత్తూరు నడిరోడ్డుమీద సభ జరిపి, స్వయంగా కాలికి గండపెండేరం తొడిగి వారి పాదాల మీద శిరస్సు ఉంచి సాష్టాంగపడడం నాలాంటివారికి అబ్బురమైన దృశ్యం. ఆనాటి సభని, ఓ కళాకారుడి సన్మానాన్ని అప్పటి ఆంధ్రప్రభ న్యూస్ ఎడిటరు జి.కృష్ణగారు మరునాడు పతాక శీర్షికని చేశారు. ఆయనొక రివొల్యూషనరీ.

తేటగీతి, ఆటవెలది సుందరాచారిగారి సొత్తు. తేనెలొలుకుతూ తెలుగుకి అలంకారంగా నిలిచేవి. కొందరు సాహితీపరులు పెంచిన పుష్పవనమైనా ఒక్క పుష్పమే రాణింపుకు వస్తుంది. ఒకానొక సినిమాకి ఆయన "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" పాటని రాశారు. తీరా సినిమాలో ఆ పాట బయటికి రాలేదు కానీ, ఆ పాట తెలుగు తల్లికి సుమహారమై, చిరస్థాయిగా నిలిచింది. ఎప్పుడు ఏ సభలో ఆ పాట విన్నా నాకు దాని మాధుర్యం మాత్రమే గుర్తుకు రాదు. సుందరాచారి గుర్తుకు వస్తారు. ఆ రోజుల్లోనే ఆయన రాసిన 'నా స్వామి' అనే చిన్న పుస్తకాన్ని నాకిచ్చారు. ఇది తేలికగా 58 సంవత్సరాల కిందటిమాట. ఇన్ని సంవత్సరాలు నా దగ్గర భద్రంగా ఉంది. పాకెట్ సైజులో ప్రింటయిన 44పేజీల పుస్తకమది. "నా స్వామి" (తిరుమల యాత్ర)లో నూరు పద్యాలు నూరు ద్రాక్షలు.

ఇందుకు ఇద్దరు మహానుభావుల కితాబు ఉంది. ఇద్దరూ అఖండులు. ఒకాయన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. (విచిత్రంగా ఆయన నాకు తెలుసు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించే నాటక పోటీలలో నేను 'అనంతం' నాటికతో పాల్గొన్నాను. బహుమతి ప్రధానోత్సవం నాడు ఉపన్యాసం ఇచ్చినప్పుడు, వేదిక దిగాక నన్ను మెచ్చుకున్న సహృదయులు శర్మగారు.)

వారు 'నా స్వామి'ని మెచ్చుకుంటూ ఒక తేటగీతిని వ్రాశారు.

హృదంతరమున కలుగు నిర్వేదంబు
విలువ నీవె యెఱుగ గలవు; నిన్ను
జొక్కి పల్కరించు సుందరకావ్యమ్ము
దీని జిత్తగించు శ్రీనివాస

మరొక కవి - ఉత్త కవికాదు కవి సామ్రాట్. మెరమెచ్చాలకు మాట తూలే మనిషికాదు. ముఖప్రీతికి భుజం తట్టేమనిషికాదు. ఆయన విశ్వనాథ సత్యనారాయణగారు ఆయన రెండే రెండు వాక్యాలు చెప్పారు. "స్వామి వచ్చి మీ గుండెలో కూర్చున్నట్లున్నది వేసంగిలో కుండలోని చల్లని నీళ్ళలో వట్టివేళ్ళు వేసి సాయమందించినట్లున్నది"

విశ్వనాథవారిని తెలిసినవారికి ఇది మనఃపూర్వకంగా చెప్పిన మాటలు.

మచ్చుకి ఈ శతకంలోని ఒకే ఒక పద్యం - మొదటి పద్యం.

క్షేత్రరాజమగుచు చెలువారు తిరుపతి
పురములోన శేషగిరి తటాన
కాపురమ్ము చేయు కాలశక్తి
నాదు చిత్తమంది కొనుము శ్రీనివాస

కాలశక్తి గురించి ఒక రోజంతా చెప్పారు సుందరాచారిగారు. ఆయన శ్రీ వైష్ణవులు, ఈ ప్రాంతపు వైష్ణవానికి ప్రతీక. ఆయన చెప్పిన విషయాలు మరెవరూ చెప్పలేనివి. మన ఊహకయినా రానివి.

2009లో సాక్షి ఆదివారం సంచిక 'ఫన్‌డే'లో కాలమ్ రాస్తూ ఈ వివరాల్ని ఉటంకించి, ప్రచురణ కర్తల్ని ఊరించాను. "అప్పటికి 49 సంవత్సరాల కిందటి ఈ పుస్తకం బహుశా ఎవరి దగ్గరా ఉండి ఉండదు. నా దగ్గర మాత్రమే ఉంది. ప్రచురణకు కోరితే ఆనందంగా ఇస్తాను. ఊరికే కాదు వందకాపీల లంచం తీసుకుని" అని రాశాను.

వెంటనే చాలామంది స్పందించారు. 2009 జూలై పన్నెండు సంచికలో గుంటూరు నుంచి లక్ష్మీనరసింహ శాస్త్రి అనే ఆయన ఉత్తరం రాశారు. "దానిని తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రిస్తే వందకాపీలు లంచంగా తీసుకుంటానన్నారు. మారుతీరావుగారికి చేసే విన్నపమేమంటే నేను వంద కాపీల లంచం ఇవ్వను. ఆ పనిని నాకప్పగిస్తే 200 కాపీలు యిస్తాను. (ఉచిత పంపిణీ నిమిత్తం)"

ఈ శతకం పదిమంది చేతికి రావాలన్నదే నా కోరిక. అలా పెద్ద యెత్తున పదిమందికి చేర్చగల స్తోమతూ, తాహతూ గల సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం. దాదపు 50 సంవత్సరాలు ప్రాణం పోసుకు నిలిచిన మహాకవి శతకం ఒక్క కాపీ - మరింతకాలం భక్తుల చేతుల్లో నిలవాలని నా తాపత్రయం.

నా విజ్ఞప్తికి తిరుమల తిరుపతి దేవస్థానం స్పందించింది. మిత్రులు, దేవస్థానం ప్రచురించే 'సప్తగిరి' పత్రిక సంపాదకులు శైలకుమార్‌గారు ఫోన్ చేశారు. "ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారు మారడం వల్ల నిర్ణయం ఆలశ్యమయింది. దయచేసి పుస్తకం పంపండి" అని.

"నేను మీ పిలుపుకోసమే ఎదురు చూస్తున్నాను" అంటూ ముందుమాటని రాసి పంపాను.

అందులో చివరిమాట "జిజ్ఞాసువులు, భక్తులు, సాహితీ ప్రియులు అందరి చేతుల్లోకి ఈ పుస్తకం రావాలన్నదే నా కోరిక ఇన్నాళ్ళకు తీరింది. ఇది తెలుగుల గుండెల్లో మరో 50ఏళ్ళు బతుకుతుంది."

దేవస్థానం ఈ శతకం 5,000 కాపీలు ముద్రించింది.

1958 డిసెంబరు. ఆంధ్రావిశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న రోజులు. జీవితం చలాకీగా, హుషారుగా సాగుతున్న రోజులు. ఒకపక్క చదువు మాగన్ను పెట్టినా అభిరుచి వేళ్ళుదన్ని బలపడుతున్న రోజులు. విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ కె.వి.గోపాలస్వామి గారి ప్రోత్సాహంతో విజృంభించి నాటకాలలో 'ఉత్తమ నటుడు' అనిపించుకున్నాను. అయిదవ అంతర్ విశ్వవిద్యాలయ యువజన సదస్సు (ఇంటర్ యూనివర్శిటీ యూత్ ఫెస్టివల్)కి ఎంపికయాను. ఆంధ్రా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుంచి వచ్చిన వివిధ శాఖల కళాకారులను ఎంపికచేసి ఒక గ్రూపుగా ఢిల్లీ పంపించారు. (మా బృందానికి పెద్ద న్యాయశాఖ రీడర్ బి.ఎన్.మూర్తిగారు) మేం ప్రదర్శించిన నాటిక భమిడిపాటి రాధాకృష్ణ రచించిన "మనస్తత్వాలు". ఇందులో నాతోపాటు విజయవాడ ఎస్.ఆర్.ఆర్, సి.వి.ఆర్ కాలేజీనుంచి వచ్చిన అమృతలింగశాస్త్రి, అత్తిలి కృష్ణారావుకాక, గుంటూరు కాలేజీనుంచి వచ్చిన ఉషారాణి, విజయవాడనుంచి వచ్చిన జయలక్ష్మి నటించిన గుర్తు.

ఢిల్లీలో ఉన్న వారం పదిరోజుల్లోనూ మమ్మల్ని ప్రధానమంత్రి నివాసానికి తీన్ మూర్తి హౌస్‌కీ, రాష్ట్రపతి నివాసానికి తీసుకువెళ్ళి విందు జరిపి ఫోటోలు తీయించారు. అవి చాలా విలువయిన జ్ఞాపికలు. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ గారి దగ్గరికి వెళ్ళినప్పుడు వారితో వి.కె కృష్ణమీనన్, గవర్నర్ శ్రీప్రకాశ ఉన్నారు. ఆ ఫోటోల్లో వారూ ఉన్నారు.

ఆ ఫోటోని ఈ 60 సంవత్సరాలలో కొన్ని డజన్ల సార్లు చూసి ఉంటాను. ఎన్నో చోట్ల ప్రచురితమయాయి. కానీ చాలామంది స్పృహలోకి రాని ఆలోచనలు ఆ ఫోటోని ఎప్పుడు చూసినా నన్ను పలకరిస్తాయి.

అప్పుడు నా వయస్సు పంతొమ్మిదేళ్ళు. నాతో ఆ గ్రూపులో నిలబడిన చాలామంది వయస్సులూ దాదాపు ఆ సమీపంలోనే ఉండి ఉంటాయి. ఆ వయస్సులో విశ్వవిద్యాలయంలో పెద్ద చదువులు చదువుకుంటూ తమ రంగంలో తలమానికంగా నిలిచిన వీరు తరువాతి కాలంలో ఏమయివుంటారు? ఈ ఆలోచన వచ్చినప్పుడల్లా మనస్సు కలుక్కుమనే రెండు జీవితాల కథలు జ్ఞాపకమొస్తాయి. ఫోటోలో అందరూ ఆనందంగా, ఉత్సాహంగా కనిపిస్తున్నారు. భవిష్యత్తు ఆ దశలో మాకెవరికీ తెలియదు. కానీ తన భవిష్యత్తు తెలిసిన ఓ అమ్మాయి మా అందరిమధ్యా ఉంది. మాతో నాటికలో నటించిన ఉషారాణి. ఎప్పుడూ నవ్వుతూ, సిగ్గుతో ఉండేది. ఆమె డాక్టర్ జయప్రదాంబ అనే గుంటూరు ప్రముఖ వైద్యురాలి మేనకోడలు. జయప్రదాంబగారి భర్త కాసరనేని సదాశివరావుగారు నగరంలో చాలా ప్రముఖ వైద్యులు. సాహితీ ప్రియులు. అత్యంత హృదయవిదారకమయిన కథ ఆమెది.

చాలా సంవత్సరాల తర్వాత ప్రముఖ రచయిత, చిత్రకారులు సంజీవదేవ్ తన స్వీయకథ 'తుమ్మపూడి'లో ఈ ఉషారాణిని గురించి రాశారు. "ఆమె జిజ్ఞాస అపారం. ఆమెదొక విషాద జీవితం. ఆమెకి చిన్నప్పటినుంచీ విపరీతమైన రక్తపోటు ఉండడం వల్ల ఉప్పులేని చప్పిడి ఆహారం ఆమెకి అలవాటు చేశారు. ఆమె వయస్సు 20 సంవత్సరాలలోపే. ఆమె ఎక్కువకాలం జీవించే అవకాశం లేదని డాక్టరు దంపతులకు తెలుసు. ఈ వెలుగుతున్న దీపం ఏ ఘడియనో ఎవరికీ తెలియకుండా ఆరిపోతుందని ఆమెకు తెలుసు.

**ఎంత విపరీతం.** ఈ ఫోటోలో కూర్చున్న ఇందరిలో ఒక వ్యక్తికి తను వెళ్ళిపోతున్న విషయం తెలుసు.

"అయినా ఆషా త్వరలో రాబోతున్న మరణం నిమిత్తమే జీవిస్తున్నట్టు తెలుసుకుని జీవించేది" ఇవీ సంజీవదేవ్ మాటలు.

అచిరకాలంలో సరిగ్గా నాలుగు సంవత్సరాలకు (1962 సెప్టెంబరు 3) ఆషా వెళ్ళిపోయింది. సురేష్‌గారు పంపిన వివరాల ప్రకారం అప్పుడామె వయస్సు 20 సంవత్సరాలు. (అంటే యూత్ ఫెస్టివల్ కాలానికి ఆమె వయస్సు 16) సంజీవదేవ్ వాక్యాలివి: "స్వల్పకాలంలో మరణం తప్పదని ఆషాకు మాత్రమే తెలుసు. తన జీవితం మొగ్గగానే రాలిపోతుంది, పుష్పంగా ఎప్పటికీ వికసించదనీ ఆమెకి నిరంతరం గుర్తుకు వస్తూనే ఉండేది."

ఆమె యువజనోత్సవాలకు వచ్చిన రోజుల్లో డాక్టర్ సదాశివరావుగారికి కొడుకు సురేష్ పుట్టాడు. ఆయన డాక్టరు. సురేష్ గారు ప్రస్తుతం అమెరికాలో ప్రాక్టీసు చేస్తున్నారు. ఆయన ఆషారాణి ఆఖరి రోజుల్లోని ఫోటోని వారి సోదరి దగ్గర్నుంచి సేకరించి పంపించారు.

ఈ ఫోటోకు సంబంధించిందే మరొక విషాదకరమైన జీవితం ఉంది. ఆ జీవితంతో నాకు చాలా సన్నిహిత సంబంధమూ ఉంది. ఫోటోలో నా పక్కనే నిలబడిన శివలెంక అమృతలింగశాస్త్రి. ఆయన తండ్రి ఆ రోజుల్లో విజయవాడలో పేరున్న న్యాయవాది. బసవయ్య శాస్త్రిగారు. స్టేజి నటులు కూడా ఆ పోలికలు కొడుక్కి వచ్చాయి. శాస్త్రి చాలా గొప్ప నటుడు. అందుకే ఢిల్లీ వరకూ రాగలిగాడు.

శాస్త్రికి ఆలిండియా రేడియో, విశాఖపట్నం కేంద్రంలో ఉద్యోగమయింది. నేనప్పటికి చిత్తూరు ఆంధ్రప్రభలో పనిచేస్తున్నాను. అయితే మాకున్న పరిచయంతో తరచూ విశాఖలో మా యింటికి వచ్చేవాడు. ఆ విధంగా మా పినతల్లి కుమార్తె సత్యవతితో పరిచయం అయింది. ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ఇది ఆక్షేపణీయమైన సందర్భం కాదు. అయితే విషయం తెలిసి - బసవయ్య శాస్త్రిగారు నాకు పెద్ద ఉత్తరం రాశారు. శాస్త్రివారి పెద్దబ్బాయి. వారు లింగధారులు. చాలా సంప్రదాయకమైన కుటుంబం. పెద్దకొడుకు వివాహం విషయంలో ఆయనకు కొన్ని ఆలోచనలు, పట్టింపులు ఉన్నాయి. అయితే ప్రేమికులు ఇరువురూ బెసగలేదు. దరిమిలాను పెద్దల ప్రమేయం లేని వివాహం. ఢిల్లీ యూత్ ఫెస్టివల్ జరిగిన ఏడేళ్ళకి జరిగిపోయింది. ఈ సంఘటన రెండు కుటుంబాలనూ ఇబ్బంది పెట్టింది.

వాళ్ళకి ముగ్గురు చక్కని పిల్లలు. కూతురు, ఇద్దరు కొడుకులు పుట్టారు. జీవనం న్యాయంగా సాఫీగా సాగాలి. కానీ శాస్త్రి వ్యసనాలకు లోనై పెళ్లైన ఎనిమిదేళ్ళకి తన 34వ యేట వెళ్ళిపోయాడు.

భార్య అంటే నా చెల్లెలు చాలా ధైర్యవంతురాలు. అప్పటికే నేవల్ డాక్ యార్డులో పనిచేసేది. మరికొన్ని దశాబ్దాలు పనిచేసి, పిల్లల్ని సాకి, వారికి పెళ్ళిళ్ళు జరిపింది. ఆమె పెద్ద కూతురు. అంటే నా మేనగోడలు పెళ్ళిని నేను రోజంతా ఉపవాసం ఉండి, మా ఆవిడతో పీటల మీద కూర్చుని (1990 ఆగస్టు 11) కన్యాదానం చేసాను. మా చెల్లెలు నాకంటే ఏడాదిన్నర చిన్న అంటే 77 ఏళ్ళు. ఆమె జీవితంలో కోరిక ఒక కారు కొనుక్కోవాలని. కొనుక్కుంది. ఉద్యోగం నుంచి రిటైరయి కొడుకు దగ్గర ఉంది. ఇప్పుడిప్పుడు చెముడు వచ్చింది. మనుషుల్నీ, సంఘటనల్నీ మరిచిపోతుంది. వృద్ధాప్యంలో మనుమరాళ్ళతో గడుపుతోంది.

శాస్త్రి కూతురు ఆలిండియా రేడియోలో పదమూడు సంవత్సరాలు అనౌన్సరుగా పనిచేసింది. అందుకు నా ప్రమేయం కూడా ఉంది. అది నాకు తృప్తి.

జీవితం ఎంత విచిత్రం. 1958 తర్వాత ఏ బాదర బందీలేకుండా ఉద్యానవనంలో పువ్వుల్లాగా జీవనయానాన్ని అప్పటి విజయాలతో (యూత్ ఫెస్టివల్‌కి ఎంపిక కావడమే ఆనాటి విజయం) ఆనందంగా గడిపిన జీవితాలు ఎలా కొడిగట్టాయో ఈ 47 సంవత్సరాలూ ఆ ఫోటో చూసినప్పుడల్లా జ్ఞాపకం వస్తాయి. కాగా, నా చెల్లెలు, పిల్లలు నా కళ్ళముందు ప్రత్యక్ష సాక్ష్యం.

మిత్రులు సింగీతం శ్రీనివాసరావుగారు విలక్షణమైన దర్శకులు. మొదటినుంచీ ఆశ్చర్యకరమైన ధోరణుల్లో సినిమాలు తీసి ప్రేక్షకుల్ని ఒప్పించినవారు. ఆ రోజుల్లో రాజాజీ 'దిక్కట్ర పార్వతి', కమల్ హాసన్‌తో 'పుష్పకవిమానం', 'లిటిల్ జాన్', 'అపూర్వ సహోదరగళ్' ఇలా ఇన్నయినా చెప్పవచ్చు. మేమిద్దరం కలిసి మంచి సినిమాలు చేశాం. నేను రాసిన స్క్రీన్‌ప్లేని యధాతథంగా తెరకెక్కించిన దర్శకులు - ఎస్.డి.లాల్, సింగీతం. సింగీతం తీసిన సినిమా "రాజా రాణీ జాకీ". 'అమెరికా అమ్మాయి' విజయవంతమైన సినిమా.

చాలామందికి తెలియని, ఆయన్ని దగ్గరగా తెలిసినవారికి మాత్రమే అర్థమయే విషయం ఆయనకి సంగీతంలో ప్రవేశం. ఆయన సినీమాల్లో పాటలలో శ్రావ్యమైన సంగీతపు 'రుచి' తెలుస్తుంది. ఆయన మద్రాసులో చదువుకు వచ్చిన తొలిరోజుల్నుంచీ సాలూరు రాజేశ్వరరావుగారికి వీర భక్తుడు. తరువాతి రోజుల్లో ఆయనకి ఒక కోరిక ఉండేది. తొలిరోజుల్లో అంటే సాలూరి వారు లలిత సంగీతం పాటలను చేసిన కళాఖండాల ప్రాతిపదికగ ఒక ఆల్బం చెయ్యాలని. ఎలాగంటే చరణాన్ని సాలూరివారి గొంతులోనే ఉంచుతూ పాటని మాత్రం ఆయనకు నివాళిగా రికార్డు చెయ్యాలని. ఆ కల అలాంటి సంగీత ప్రియత్వం ఉన్న మరొక కళాభిజ్ఞులు మల్లాది సచ్చిదనందమూర్తిగారి సాహచర్యంలో ఎన్నో సంవత్సరాల తర్వాత దొరికింది. మల్లాదివారిది కూడా అనుపమానమైన సంగీత ప్రియత్వం. వారి తండ్రిగారు హరికథలు చెప్పేవారు.

2007లో సింగీతంగారి కల కార్యరూపం దాల్చింది. ఉత్తుత్తినే కాదు. ఏకంగా విశ్వరూపాన్నే దాల్చింది. మల్లాదివారి ప్రమేయంతో, సింగీతం వారి పరిచయాలతో సినీ, సాహితీ రంగంలోని ఎందరో ప్రముఖులు ఇందులో పాత్రల్ని వహించారు. మొదట సాలురి వారి ఎనిమిది అపూర్వమైన పాటల్ని ఎంపిక చేసుకున్నారు. ఏమిటవి? సంగీత ప్రియులు వినగానే పులకరించే పాటలు. చల్లగాలిలో, తుమ్మెదా ఒకసారి, కలగంటి కలగంటి, గాలివానలో, హాయిగా పాడుదునా, ఓ విభావరీ, నావను నడిపే, పాట పాడుమా, ఇవి పాటలు. వీటి బాణీలలో సాలూరివారికి నివాళిని అర్పిస్తూ కవులు పాటలు రాయాలి. అందుకు వేటూరి, వెన్నకలంటి, సిరివెన్నెల సీతారామశాస్త్రి, భువనచంద్ర, సాయికృష్ణ యాచేంద్ర. ఇంతవరకు జగమెరిగిన కవిల జాబితా. ఈ తరువాత ముగ్గుర్ని ఇందులో చేర్చారు. సింగీతం శ్రీనివాసరావు, మల్లాది సచ్చిదానందమూర్తి, గొల్లపూడి మారుతీరావు.

నేనేదో అప్పుడప్పుడు పాటలు ఆపద్ధర్మంగా ఆలిండియా రేడియోలోనూ, అడపాతడపా రాసినవాడిని. ఒక మహానుభావుడికి నివాళి కార్యక్రమంలో జగమెరిగిన గీతానికి ట్యూన్‌కి పాట రాయడం అదిన్నీ వేటూరి, సిరివెన్నెల వంటివారి సరసన నిలిచి రాయడం నాకు తలకు మించిన పని. నన్ను కదిపినప్పుడు మల్లాదివారికి ఆ మాటే చెప్పాను. "బాబోయ్ నన్ను ఈ మహా యజ్ఞంలో ఇరికించకండి" అని. ఆయన అంగీకరించలేదు. కాగా "మీ నా ప్రైజ్ హార్స్. మీ నుంచి గొప్పపాటని ఆశిస్తున్నాను" అని రెచ్చగొట్టారు.

అందులోనూ ఓ విభావరీ' పాట. ప్రతీ చరణం రెండు గతుల్లో సాగుతుంది. వినడానికి హృద్యంగా, వ్రాయడానికి ఛాలెంజ్‌గా ఉందీ పాట. సాయకృష్ణ యాచేంద్ర అన్నారట - 'ఈ పాట గొల్లపూడిగారి వల్లకాదు' అని.

'నేను ఆయనతో ఏకీభవిస్తున్నాను" అన్నాను.

కానీ మల్లాది మాటలివి: “I have kept you at the highest esteem and accepted the challenge. Your song should create history”

ఇది బొత్తిగా అలవాటులేనివాడిని గోదావరికి అడ్డంగా ఈదమన్నట్టు.

అప్పటికప్పుడు తపస్సుకి కూర్చున్నట్టు కలం పట్టుకున్నాను. ఒక చరణం నడిచింది. ఫోన్‌లో విని మల్లాది స్టన్ అయిపోయారు.

"నాకు మాటలు రావడంలేదు. ఆగకండి. మరో చరణం కావాలి" అన్నారు. నా గుండెల్లో రాయిపడింది. ఎలాగో పూర్తిచేశాను.

**ఇక పాటల్ని పాడినవారి** జాబితా మరో చరిత్ర. తెలుగు సంగీత ప్రపంచంలో చరిత్రను సృష్టించిన మహాగాయకులంతా ఉన్నారు - రావు బాలసరస్వతి, పి.సుసీల, ఎస్.జానకి, ఎస్.పి.బాలసుబ్రమణ్యం, వాణీ జయరాం. ఎమ్.ఎమ్.కీరవాణి, కొసమెరుపు: సింగీతం శ్రీనివాసరావు.

పాటలబాణీలన్నీ సింగీతం చేశారు. ఇంకా విశేషం మధ్య మధ్య వచ్చే బి.జి.యం (బ్యాక్ గ్రౌండ్ సంగీతం మళ్ళీ సాలూరివారి ప్రముఖ సినీగీతాల బాణీలను వాడారు) అదొక తన్మయత్వం.

ఆనంద పారవశయం. పాటంతా ఆ రచయిత నివాళిగా సాగి పల్లవి సాలూరివారి గొంతులో వినిపించగానే ఒళ్ళు పులకరించేది.

నేను రాసిన పాట.

హృదయాన తావి చిగురించు మోవి నీ పాట అందాల దీవి
యెదలోని బంగారు స్వప్నాలు నిజమయ్యేను నీ నోట గీతాలై
గుండెలో రాతి బండలో కొత్తరాగాలు పలికించెనే
కాలమే ఒక శ్రోతయై తన గమనాన్ని మరిపించెనే
మల్లెలే పూచి మనసుపడ్డాయి నీ పాట కావాలని
వెన్నెలే వేచి వెల్లివిరిసింది నీ నోట పలకాలని
వింతగా కొత్తరాగాలు చిగురించి మమ్మావహించేనులే
పల్లవే బతుకు పల్లవై తరియించి పోవాలని
ఏనాటికీ నీ పాటకి దాసోహమన్నాయిలే
మదిలో శ్రుతియై నిలిచేవు నీవు
ఎన్నో తీపి మాధురీ ఝురులై
సౌందర్య సిరులై
మమతపు విరులె ||ఓహో విభావరీ ||
నీ పాటలన్నీ నీరాజనాలై కనులకే కలలు నేర్పాయి
నీ స్వప్నాలన్నీ నాగస్వరాలు మనసుకే మమత కూర్చాయి.
ఊసులే కొత్త బాసలై నినదించేను మా గుండెలో
రాజువై రారాజువై రస రాజ్యమ్మునే లేవులే
సంగీతమే సంగాతియై నీ తోడు నిలిచేనులే.
ఒకరే ఒకరే సాలూరు స్వామి
ఒకరే రసనకు రాజ్యాధినేత
ఆనంద గీత
సంగీత దాత ||ఓహో విభావరీ ||

ఆవిష్కరణ సభని హైదరాబాదులో నిర్వహించారు మల్లాది సచ్చిదానందమూర్తిగారు. సభకి తండోపతండాలుగా ప్రేక్షకులు రాకపోయినా చిరస్మరణీయమైన సభ అది. ఆనాడు పైన చెప్పిన వారందరితోపాటు ఇద్దరు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. కె. విశ్వనాథ్, గుమ్మడిగారు. అందరిలో నేనే కాస్త సంగీతానికీ, గీత రచనకీ దూరంగా ఉన్నవాడిని. కానీ గడుసుగ ప్రసంగాన్ని జరిపి తప్పించుకున్నానని తృప్తిపడ్డాను.

ఈ ఆత్మకథ ప్రశంసల వెల్లువతో నింపడం ఉద్దేశం కాదు. కానీ ఆ నాటి సభ గురించి మరో ఇరవై రోజుల తర్వాత విజయవాడనుంచి ఒక అభిమాని, మిత్రులు ఉత్తరం రాశారు. ఆయన జె.వి.పి.ఎస్ సోమయాజులుగారు. లాకాయి లూకాయి వ్యవహారానికి బెసిగే మనిషికారు. కాగా నా ప్రసంగాన్ని ఎపుడు విన్నారు? ఆ రోజు సభలో ఉన్నారా? గుర్తులేదు.

ఇదీ ఉత్తరం: "ఆ కార్యక్రమం ఒక ఎత్తయితే మీ ప్రసంగం మరొక యెత్తు. ఇది ముఖస్తుతి కాదు. మీరు సినీమా కవికాకపోయినా మీరు రాసిన ఆ పాట అద్భుతం. అంతకన్నా బాగుంది మీ మాట. ఎప్పుడూ మీ ప్రసంగాలు హైలెట్స్. మీ ఎత్తుగడ, విషయం, మాటల విరుపు, స్వచ్ఛమైన తెలుగు కూడా. నా ఋషిః కురుతే కావ్యం – అన్న వాక్యానికి మీరు చక్కని ఉదాహరణ."

ఈ ఉత్తరం బొత్తిగా స్వోత్కర్షలాగా ఉంటుందేమోనని ఇందులో చేర్చకూడదనుకున్నాను. మరి ఎందుకు చేర్చాను? ప్రశంస పట్ల వ్యామోహం మనస్సులో ఎక్కడో ఉంది. కాగా ఇది కాస్త అపురూపమయినది.

ఒకరోజు మా పెద్దబ్బాయి నా గదిలోకి వచ్చాడు. తన రెండో కూతురు –శ్రావణి – అంటే నా రెండో మనుమరాలు లాప్ టాప్‌లో ఎవరితోనో ప్రసంగం సాగిస్తోందట. నన్ను పిలిచి అదిలించమని చెప్పాడు.

ఇలాంటి పనుల్లో నేను మొనగాడిని. కేవలం మాటల్తో నిలదీయడం, నిగ్గు తేల్చడం, సమర్థించడం, అవసరమయితే శిక్షించడం నాకు వెన్నతో పెట్టిన విద్య. "నీ చేతలుకంటే నీ మాటలు ఎక్కువ హింసిస్తాయి" అంటారు పిల్లలు. మా మూడో అబ్బాయి వెళ్ళిపోయిన వాసూ నా మాటలకి పాంటులోనే మూత్ర విసర్జన చేసేసేవాడు. ఇది అవసరమా? అసంబద్ధం కాదా? వయస్సు మీద పడుతున్న కొద్దీ ఆవేశం, మాటలో పదును తగ్గింది. ఇప్పుడా 'చురుకు' లేదు. అవసరమూ లేదని వయస్సు నేర్పింది.

కాగా నా మనుమరాలికి పాఠం చెప్పడం ఎంత పని? నా గదిలో కూర్చోపెట్టాను. ఆమెతోపాటు మరో ఇద్దరు మనుమరాళ్ళు – మా పెద్దబ్బాయి మూడో కూతురు శ్రీ వర్షిణి, మా రెండో అబ్బాయి కూతురు శాంతిశ్రీ ఇది చాలా ముఖ్యమయిన సమావేశం. ఇలాంటి విషయం ఆడపిల్లలతో మాట్లాడి వాళ్ళని అదిలించడం మొదటిసారి. మనస్సులో నా మాటల్ని పదును పెట్టాను.

ఎదురుగా ముగ్గురు మనుమరాళ్ళు. "నేనిప్పుడు చెప్పబోయేది మీ ముగ్గురికీ వర్తిస్తుంది. మీరు ముగ్గురూ తెలుసుకోవలసిన విషయం" ఇలాగేదో మొదలుపెట్టాను. శ్రావణికి విషయం అర్థమయింది. ఆమె పెదవులు వణికాయి. మరో రెండు వాక్యాలు నా నోటివెంట పెగిలాయి.

ఆమె కళ్ళనిండా నీళ్ళు. ఇంకో రెండు వాక్యాలు. ఇదేమిటి? నేను తడబడ్డాను. నాకు తెలియకుండానే నా కళ్ళల్లో నీళ్ళు.

మూడో వాక్యానికి శ్రావణి ఎదురుగా కూర్చోలేదు. నా దగ్గరికి వచ్చి, నన్ను కావలించుకుని "తాతా" అని ఏడుస్తోంది. నాకు తెలియకుండానే నేనూ ఏడుస్తున్నాను. అది చాలదు. ఎదురుగ్గా కూర్చున్న ఇద్దరు పిల్లలూ ఏడిస్తున్నారు. ఏమైంది నా పదునయిన వాగ్ధోరణి? ఏమయింది నా చాతుర్యం.

సీను అర్థాంతరంగా మారిపోయింది. ఆవేశాన్ని ఆర్ధ్రత మింగేసింది. కథ ఆగిపోయింది.

ఆ సాయంకాలం మా అబ్బాయికి చెప్పాను. "బాబూ నేను అదిలించి బెదిరించే తరం మీతోనే అయిపోయింది. ఈ తరానికి నేను తాతని. పిల్లల్తో నేనూ ఏడిచాను. వీళ్ళని తిట్టడం నా వల్లనయే పనికాదు. మీ తంటాలు మీరు పడండి" అన్నాను.

ఆత్మీయతలు హృదయాన్ని ఆర్ద్రం చేసి మమకారాల్ని మరో స్థాయిలో నిలిపిన నా పాత్ర తాత. అదలించే తండ్రి కిందటి తరం మనిషి. ఇప్పటికీ మనుమల పట్ల మమకారం నా రెండు కళ్ళనీ ఉదారంగా నింపుతుంది. అది సృష్టి వృద్ధాప్యానికి దక్కించిన వరం. ఇక్కడ నా పాత్ర – తాత.

మా అమ్మ కళ్ళు మూసే ముందు సరిగా 18రోజులకు ముందు మా తమ్ముడి కూతురు పెళ్ళయింది. పెళ్ళి సంబంధాలు చాలా వచ్చేవి. అమ్మాయిని చూసి వెళ్ళేవారు. అందరూ కుర్రాడిని "పిల్ల నచ్చిందా?" అని అడిగేవారు.

ఒక్క మా అమ్మే మనుమరాలిని దగ్గరికి పిలిచి "ఆ కుర్రాడు నీకు నచ్చాడా? నచ్చకపోతే చెప్పు. మీ నాన్నతో చెప్పి ఒప్పిస్తాను" అనేది. ఆమెకి 86 సంవత్సరాలు. ఈ ఆత్మీయమైన అధికారాన్ని ఎవరు ఎవరికి ఇవ్వగలరు? అవసరమైతే నా మనుమరాలికోసం మా అబ్బాయి, కోడలి మీద యుద్ధాన్ని ప్రకటించగలను. అయితే అవసరంలేని ఆత్మీయతలు ఆ వయస్సుకి పెట్టుబడి.

ఉన్నట్టుండి ఆలిండియా రేడియో, హైదరాబాదునుంచి నాకో కాంట్రాక్టు వచ్చింది. చూసి షాక్ అయాను. కారణం పాట రాసినందుకు ప్రతిఫలమది. నాకు తెలిసి ఎప్పుడయినా రేడియోలో పని చేస్తున్న రోజుల్లో పాటలు రాశాను. అవికూడా చాలా తక్కువ. పాటకి డబ్బు సంపాదించిన సందర్భం నాకు గుర్తులేదు. కాగ ఇప్పుడు నాకు అర్ధంకాని, గుర్తులేని ఈ పాటకు వంద రూపాయల పారితోషకం. ఈ మాటే చెపుతూ ఎగ్రిమెంటు మీద సంతకం చేసి పంపించాను. కొన్నాళ్ళకి మిత్రుడు కలగా కృష్ణమోహన్ ఫోన్. "అయ్యా, మీరు 34 సంవత్సరాలకిందట రాసిన ఒకానొక పాటని ప్రముఖ గాయకులు పూర్ణచందర్‌గారు మాకు చేర్చారు. దానికి ఆయనే బాణీని ఏర్పరిచి గానం చేశారు. అందుకు ఈ పారితోషికం" అని. ఇప్పుడు నా ఆశ్చర్యం మరింత ఇనుమడించింది. గుర్తు చేసుకోడానికి ప్రయత్నించాను.

మిత్రులు, సాహితీ ప్రియులు రమణయ్య రాజాగారు 1976లో ఆర్.కె.రావు (రావి కొండలరావుగారి అన్నగారు) షష్టిపూర్తిని విజయనగరంలో జరిపించారు. ఆ రోజుల్లో రాజాగారు (మా అందరికీ ఆయన పేరది) ఎందరికో సన్నిహితులు, ఆత్మీయులు. ఒక పెద్ద బృందాన్నే మద్రాసు నుంచి తరలించుకు వచ్చారు. ఈ ఫోటోల్లో వ్యక్తులు - సభలో ఒక పక్క కూర్చున్నవారు. నేరెళ్ళ వేణుమాధవ్, ఇన్‌కంటాక్స్ కమీషనర్ గొల్లపూడి రామదాసు, విద్వాన్ విశ్వం, దాశరథి, ఆచార్య ఆత్రేయ, నేను - ఇలాగ. ఆ రోజుల్లో ఒక్క రాజాగారే ఇంత గొప్ప ప్రముఖులతో సమావేశాన్ని చేయగల పరిచయాలు ఉన్నవారు. ఆ ఉత్సవంలో నరాల రామిరెడ్డి అవధానం చేశారు సభకి గాయకులు పూర్ణచందర్ కూడా వచ్చారు. ఎవరు ఎలా ప్రోత్సహించారో ఇప్పుడు గుర్తులేదుగాని, ఆ సభలో అప్పటికప్పుడు పాటని రాశాను. ఆ పాటని అప్పటికప్పుడు పూర్ణచందర్ బాణీని నిర్ణయించుకుని స్టేజి మీద పాడారు. అప్పటికి అదొక సరదా నాకు. తర్వాత ఆ పాటనీ, అలా రాసిన విషయాన్నీ మరిచిపోయాను. పూర్ణచందర్ దగ్గర ఆ పాట మిగిలినట్టుంది. ఏదో సందర్భంలో కలగా కృష్ణమోహన్‌కి ఆ విషయం చెప్పివుంటాడు. ఇప్పుడు గొల్లపూడి పాటకి కొత్త 'రుచి' కదా! ప్రసారానికి కృష్ణమోహన్ సమకట్టాడు. ఇదీ కథ.

రికార్డింగుని నాకు కృష్ణమోహన్ పంపాడు. వింటూంటే కొత్త అనుభూతి. తప్పిపోయిన కొడుకు కనిపించినంత ఆనందం. కానీ పాట బొత్తిగా గుర్తులేదు.

వెన్నెల రేయెటు వేగెనో యిక
ఉన్న క్షణాలిటె సాగెనో
పున్నమి జాబిలి పులకింతలో
సన్నగ సన్నగ సఖీ! పిలిచెనో          వెన్నెల
నిన్నటి బాసలు రేపటి తలపులు
నిన్నే రమ్మని పిలిచెనే

ప్రాణగ సఖీ! నా డాగ చేరి

తనూలత నూతన లాలనలో కనుపాపలలో కదిలే రాణీ

కౌగిలిలోనే వాలవేలనే

ప్రాణసఖీ నా మదిలో మధువై

రాగా సరాగపు లాలనలో వెన్నెల

సరే. ఈ పాటలో 'డాగ' ఏమిటి? ఇది 42 సంవత్సరాల కిందట పూర్ణచందర్ దగ్గర మిగిలిన సాహిత్యం. అక్షరాలు మారాయో? అర్థమే మారిందో ఇప్పుడు గుర్తులేదు. 42 సంవత్సరాల కిందటి భాషా స్కాలిత్యం ఇప్పుడు చరిత్ర. అంతవరకే.

**నా జీవితంలో** చాలా సంస్థలు ఉదారంగా నాకు బిరుదులిచ్చాయి. అవన్నీ నన్ను వెక్కిరించినట్టుంటాయి. ఏదీ నా పేరుకి తగిలించుకోను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ ఉగాదినాడు దాదాపు ఓ నలభై ఏభై మందికి మూక ఉమ్మడిగా 'కళారత్న (హంస) బిరుదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి చేతులు మీదుగా ఉదారంగా పంచిపెట్టింది. మోయడానికి వీలులేనంత బరువైన హంస విగ్రహం, ఓ శాలువా. ఒక్కనాడూ దాన్ని నా పేరుకి తగిలించుకోలేదు. ముమ్మిడివరం రోటరీ క్లబ్బు "సాహితీ రత్న" అన్నారు. ఇలాంటి బిరుదులు కుప్పలు కుప్పలు. ఏవొక్కటీ మనస్సుదాకా పోలేదు.

చాలా సభల్లో, ఆహ్వాన పత్రాలలో నా పేరుకి ముందు 'డాక్టర్' తగిలించిన సందర్భాలు చాలా ఉన్నాయి. పోలీసోడికి పాము మంత్రం రాదా అన్నట్టు ఇంత వయసొచ్చిన రచయితకి డాక్టరేటు ఉండదా అని వారి ధైర్యం. ఆ సభల్లో విధిగా చెప్పేవాడిని "బాబూ! నేనింకా పేషెంటునే. డాక్టర్ని కాను" అని.

న్యాయంగా 58 సంవత్సరాల కిందట చదివిన నా మాతృ సంస్థ ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆ పని చెయ్యాలి. ఒకటి రెండుసార్లు మరేవో విశ్వవిద్యాలయాలు ఆ ప్రయత్నం చెయ్యడం నాకు తెలుసు.

ఎట్టకేలకు విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయం ఆ ఘనతని నాకు సంపాదించిపెట్టింది. "మీకెప్పుడో ఇవ్వాలి మారుతీరావుగారూ" అంటూ ఏవో కారణాలు గొణిగారు.

ఎమ్.వి.విఎస్ మూర్తిగారు. అయితే చాలా ఘనంగా, గొప్పగా స్నాతకోత్సవం జరిగింది. పద్మశ్రీ డాక్టర్ బద్వే అనే బొంబాయి శాస్త్రకారునికి కూడా ఆ సంవత్సరం డాక్టరేటు ఇచ్చారు. ఆ ఉత్సవానికి నా కుటుంబం అంతా హాజరయింది.

ఆ ఉత్సవంలో నా కృతజ్ఞతా పూర్వకమైన ప్రసంగం హైలైట్. మరునాడు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రసాదరావుగారు ఒక మనిషిద్వారా ఉత్తరాన్ని పంపుతూ "Thanks for your electrifying speech" అని అభినందించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "నేను నా రోజుల్లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో అతి నేలబారు విద్యార్థిని. కాని నా మనస్సుకి దగ్గరగా ఉన్న 'అభిరుచి'ని పెంపొందించుకుని యూనివర్సిటీనుంచి బయటికి వచ్చాను. తర్వాత 56 సంవత్సరాలు ప్రయాణం చేసి ఎట్టకేలకు మరో యూనివర్సిటీకి (గీతం) చేరాను. డిగ్రీ చేతికి రావడానికి మీకు మూడేళ్ళు పట్టింది. నాకు మనస్సుకు నచ్చిన వ్యావృత్తిలో డిగ్రీ రావడానికి 64 సంవత్సరాలు పట్టింది" ఇలా సాగింది నా ప్రసంగం.

ఉత్సవం తరువాత ఎమ్.వి.వి.ఎస్ మూర్తిగారు హార్దికంగా అభినందిస్తూ రిజిస్ట్రార్ని పిలిచి "డిగ్రీ ఇవ్వడమే కాదు. వీరికి విజిటింగ్ కార్డులు, లెటర్ హెడ్స్ ముద్రించి పంపండి" అన్నారు.

అద్భుతమైన ఆల్బంతో పాటు, అవన్నీ స్వయంగా తెచ్చి ఇచ్చారు రిజిస్ట్రార్‌గారు. కానీ నా విజిటింగ్ కార్డు ఎవరికి ఇవ్వను? సినిమావాడిగా నా ఫోన్ నంబరు 'అల్లరి'కి మూలకారణమవుతుంది.

దురదృష్టం మూర్తిగారు దారుణమయిన ఆక్సిడెంటులో అమెరికాలో కన్నుమూశారు.

అయితే ఇప్పటికీ ఎన్నడూ నా పేరుకి ముందు 'డాక్టర్' తగిలించుకోను. నాకు వచ్చే ప్రతీ ఉత్తరంలోనూ 'డాక్టర్' తప్పనిసరిగా ఉంటుంది.

పైవారు చూపినప్పుడు ఆ 'మర్యాద'కి రుచి పెరుగుతుందనుకుంటాను.

ఒక విచారకరమైన సందర్భం ఎప్పుడూ జ్ఞాపకం వస్తూంటుంది. మిత్రుడు, రచయిత, నటుడు పులికంటి కృష్ణారెడ్డి సాహితీపరులకు ఏటేటా సత్కారం చేయతలపెట్టాడు. కష్టపడి పైకొచ్చినవాడు. సమర్ధుడు - సాటి ప్రముఖులను సత్కరించడం గొప్ప సంస్కారం.

ఒక సంవత్సరం నాకు సత్కారం చేయనున్నట్టు ఫోన్ చేశాడు. చాలా ఆనందించాను. సత్కార సభలో చదవడానికి నా గురించి ఒక పద్యం రాసి పెట్టుకున్నాడు.

గొల్లపూడివారి గురుతరమౌ ప్రజ్ఞ
నటన నవల కథల పుటము వెట్టె
తమిళనాట కీర్తి తనకు తానే స్ఫూర్తి
సకరింప జన్మ సఫలమాయె

సభ 2007 జనవరి 27న తిరుపతిలో జరిగింది. నాతోపాటు సత్కారమందుకున్న మరొక పండితులు, ప్రజ్ఞాధురీణులు శలాక రఘునాథ శర్మగారు. విషాదం ఏమిటంటే ఆనాటికి కృష్ణారెడ్డి లేడు. కుటుంబ సభ్యులు సత్కారం జరిపారు. అందరి కళ్ళల్లో నీళ్ళు. ప్రసంగించే నా కంటిలో కూడా నా ప్రసంగానికి ఆఖరి వాక్యం గుర్తుంది. "తెలుగుదేశానికి కృష్ణారెడ్డి రాయలసీమ చిన్నోడు. కానీ ఇవాళ 'పెద్దోడు' అయిపోయాడు" తర్వాత మాట రాలేదు. ప్రసంగం ఆగిపోయింది.

మనస్సుకి దగ్గరగా వచ్చిన ఒక సత్కారం 2009 సెప్టెంబరు 10న జరిగింది. ఏదో ప్రసంగమంటూ ఫోన్ చేసి రానూపోనూ విమానం ఖర్చులు ఇచ్చారు మిత్రులు వోలేటి పార్వతీశం. తీరా హైదరాబాదు దూరదర్శన్‌కి చేరాక తెలిసింది. మనదేశంలో దూరదర్శన్ ప్రసారాలు ప్రారంభమయి 50 సంవత్సరాలయింది. ఆ సందర్భంగా దూరదర్శన్‌తో బంధుత్వమున్న ఓ 'పెద్ద'ని సత్కరించాలని పూనుకున్నారు దూరదర్శన్ అధికారులు. అప్పుడు డైరెక్టర్ మధుసూధనరావుగారు. నన్ను ఎంపిక చేశారు. ఈ సత్కారం సరాసరి ప్రసారం. 20 సంవత్సరాలు పనిచేసిన నా మాతృ సంస్థ జరుపుతున్న సత్కారం నిజంగా హృదయాన్ని తాకింది. ఆ మాటే నా ప్రసంగంలో చెప్పాను.

ఒక్కొక్కప్పుడు సత్కారానికి హంగు, ఆర్భాటం అక్కరలేదు. మనస్సులోంచి వచ్చే, ఇచ్చే గౌరవం కలకాలం గుర్తుండిపోతుంది.

తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాలయంలో పనిచేస్తున్న ముదివర్తి కొండమాచార్యులుగారు వయస్సులో నాకన్నా పెద్ద. ఉన్నట్టుండి తాము వ్రాసిన తొమ్మిది పుస్తకాలను పంపుతూ ముందు ఒక పేజీలో ఒక పద్యాన్ని రాశారు.

బహు చలన చిత్ర నటునిన్
బహు రమ్యవచో విలాస బహుకృతి కర్తన్
బహు కవి మిత్రుని మెచ్చెద

మహనీయుని గొల్లపూడి మారుతి రావున్

ఈ పద్యం మనస్సులో నిలిచిపోయింది 'బహు కవి' కాస్త ఇబ్బంది పెడుతున్నా.

అయితే మూడు సత్కారాలు మనస్సుదాకా పోయినవి యిక్కడ ఉటంకించాలి.

ఏటేటా గుంటూరులో అతి సంప్రదాయ యుక్తంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే మిత్రులు ఒకాయన ఉన్నారు. సింగం లక్ష్మీనారాయణగారు. ఆయన నాకూ, నా కాలమ్‌కీ వీర భక్తుడు. జింఖానా క్లబ్బు ఆవరణలో వేదికమీద కుర్తాళం పీఠాధిపతి సిద్ధేంద్ర స్వామివారుండగా భువనచంద్ర, జొన్నవిత్తుల, కడియాల రామమోహనరాయ్ వంటివారుండగా నాకు 2009 ఉగాదికి కొండముది శ్రీరామచంద్రమూర్తి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు. ఆ పేరు వినగానే మనస్సు జివ్వుమంది. కారణం యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో శ్రీరామ చంద్రమూర్తిగారు నాకు ఒక సంవత్సరం సీనియర్. జీవితంలో ఎన్నో సందర్భాలలో తారసపడిన మిత్రుడు. ఆ రోజుల్లోనే ఆయన రాసిన నాటిక 'గడ్డిపూలు' విజయనగరం రాఘవ స్మారక నాటక పోటీలలో ప్రదర్శించాను. 46 సంవత్సరాలుగ అవిచ్ఛన్నంగా సాగుతున్న నా కాలమ్‌కి 'జీవనకాలమ్' అని నామకరణం చేసిన హితుడు. నన్ను సత్కరించి, ఆయన కూతురు, అల్లుడు పాదాభివందనం చేశారు. ఇది నా తరం మిత్రుడే జ్ఞాపకంగా మారిన భాధాకరమైన సందర్భం.

**నా జీవితంలో** పదే పదే చదివిన గ్రంథం శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'అనుభవాలూ - జ్ఞాపకాలూను'ఎన్నిసార్లు చదివానో గుర్తులేదు. అనపర్తి, పొలమూరులో వారి ఇల్లు, రాయవరం మునసబుగారు ఇలా ఎన్నయినా మనస్సులో కదులుతాయి. అయితే ఏనాడూ ఆ ప్రాంతాలకు వెళ్ళలేదు. ఉన్నట్టుండి ఒకాయన ఫోన్ చేశారు. దుర్భా శ్రీరామమూర్తిగారు. పొలమూరు అంటే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ఊరులో వారి పేరిట నాకు పురస్కారాన్ని ఇస్తారని. మాటల్లో "మా యింటి ఎదురిల్లే శ్రీపాదవారి ఇల్లుసార్" అన్నారు అంతే ఇక కాదనలేదు. రాజమండ్రిలో దిగి కారులో పొలమూరు చేరాను. దుర్భా శ్రీరామమూర్తిగారు చక్కని మిత్రులు. ఆనాటి సభని నిర్వహించారు. అయితే వారింటి ఎదురుగా ఉన్న ఒకప్పటి శ్రీపాదవారి ఇల్లు ఇప్పుడు రూపురేఖలు మారిపోయి ఉంది. కేవలం అనుకోడానికి తప్ప అక్కడేమీ లేదు. అయినా రాయవరం, అనపర్తి, పంట కాలువలు అన్నీ మనస్సులో జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తిరిగాను. ఆనాటి సభకు పెద్దలు, హితులు, నేనంటే అమితమైన అభిమానం గల ఆవంత్స సోమసుందర్ గారు పెద్ద సంచితో తన పుస్తకాల్ని తీసుకుని పిఠాపురంనుంచి వచ్చారు. నేను చదువుకున్న రోజుల్లో తెన్నేటి విశ్వనాథంగారి ఆధ్వర్యంలో విశాఖపట్నం టౌన్ హాలులో జరిగిన శ్రీపాదవారి కనకాభిషేకానికి నేను రాసిన పద్యాల మూల ప్రతిని నాకు చేర్చిన చామర్తి కనకయ్యగారు వచ్చారు. ఆయన శ్రీపాదవారి కథల మీద పరిశోధన చేస్తున్నారు. ఆయన కాలం చెయ్యగానే వారి కుటుంబీకుల దగ్గరకి వెళ్ళి ఒక ట్రంకు పెట్టెలో వారి రచనలన్నింటినీ తెచ్చుకున్నారు. వీరిద్దరూ ఆనాటి సభలో ఉన్నారు. ఆవంత్స వేదిక మీద ఉన్నారు. చాలా కారణాలకి శ్రీపాద వారి స్మారక పురస్కారం ఎంతో ఆత్మీయంగా, స్మరణీయంగా నిలిచింది.

వంగూరి చిట్టెన్ రాజుగారు నాలుగు దశాబ్దాల క్రితం అమెరికా చేరిన తెలుగు ప్రభంజనం. చాలామంది తెలుగువారు ఇప్పటికీ నాలుగు రాళ్ళు వెనకేసుకోడానికి అమెరికా చేరతారు. కొందరు వెనకేసుకున్నారు కూడా. కానీ సాంస్కృతిక ఉద్యమాన్ని ముందేసుకుని నాలుగు రాళ్ళు నష్టపోడానికి అలవాటు పడిన తెలుగువాడు చిట్టెన్ రాజు. మంచి హాస్య రచయిత. తన పుస్తకాలేకాక అమెరికాలో ఉన్న ఎందరో తెలుగు రచయితల పుస్తకాలను ప్రచురించి, చదవడం అలవాటులేని చాలామందికి చదువు నేర్పారు. ప్రపంచమంతా అమెరికా సరే, లండన్, సింగపూర్, మెల్బోర్న్ ఇలా చాలాచోట్ల తెలుగు మహాసభలు నిర్వహించారు. ఆయన చేతులు నల్లగా ఉంటాయి. కారణం చాలాసార్లు చేతులు కాల్చుకున్నాను. నేను చాలా సభలలో పాల్గొన్నాను.

2009 ఫిబ్రవరిలో హైదరాబాదు త్యాగరాయ గాన సభలో తెలుగు మహాసభలు జరిపారు. ఆఖరి రోజున నాకు 'జీవన సాఫల్య పురస్కారం'తో సత్కరించారు. నన్నూ మా ఆవిడనీ కూర్చోపెట్టి ఘనంగా సత్కరించారు. ఆనాటి సభ, హాజరయిన సాహితీపరుల అభినందన చిరస్మరణీయం. సత్కారం మిత్రులు సి.నారాయణరెడ్డిగారి చేతుల మీదుగా జరిగింది. వంగూరి చిట్టెన్ రాజుగారు సభలో ఉన్న అందరు సాహితీపరులను వేదికమీదకి ఆహ్వానించి దంపతులకు శుభాకాంక్షలు పూలతో తెలిపేట్టు చేశారు. ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, కిరణ్‌ప్రభ సతీమణి కిరణ్, నేరెళ్ళ వేణుమాధవ్, ద్వానా శాస్త్రి, అబ్బూరి చాయాదేవి, బలబద్రపాత్రుని రమణి, చేకూరి రామారావు, వంశీరామరాజు, డి.కామేశ్వరి, అవసరాల రామకృష్ణారావు, సుధామ, పాలకోడేటి అభినందించారు. అమెరికానుంచి వచ్చిన మిత్రులు డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి ప్రసంగించారు. అదొక ఆనందకరమైన సన్నివేశం.

సత్కారాల ప్రసక్తి వచ్చింది కనుక ఇక్కడ మనసు విప్పి కొన్ని విషయాలు చెప్పాలి.

ఏనాడూ ఆయా సభల ఫోటోలుగాని, సన్మాన పత్రాలుగానీ మా యింట్లో గోడలకి ఉండవు. కారణం వాటిపట్ల గౌరవం లేకకాదు. తగిలించడం ప్రారంభిస్తే ఇంట్లో గోడలు చాలవు. కాగా 'నిన్న'టిని గోడలకి అలంకరించడానికి మనస్కరించదు. ఆలోచన, ఆదర్శం ముందు చూపుతో ఉండాలని భావన.

మా యింట్లో దొంతర్లుగా సన్మాన పత్రాలు ఉన్నాయి. ఇచ్చినవారి పట్ల గౌరవం లేకకాదు. ఎట్టి పరిస్థితులలోనూ సభలో కార్యనిర్వాహకులు ఇచ్చిన పూలచెండుని కూడా వదిలిపోను. వాళ్ళను అగౌరవపరిచినట్టు అనిపిస్తుంది. అయితే తప్పనిసరిగా కొన్నయినా షీల్డులు అలమరలకి ఎక్కుతాయి. మా యింట్లో దేవుడి గదిలో ఉన్న చిన్న చిన్న పూజా సామగ్రి కూడా కొన్ని సందర్భాలలో ఎవరెవరో ఇచ్చినవి. స్వామికి నివేదన జరిపే చిన్ని వెండిగిన్నె దగ్గర్నుంచి స్వామివరకు అభిమానుల జ్ఞాపకాలు పలరిస్తూంటాయి. ఇది అరుదైన అదృష్టంగా భావిస్తాను.

మిత్రులతో నేను సరదాగా అనే మాట: ఈ యింట్లో నేనూ, మా ఆవిడా తప్ప ప్రతీ వస్తువూ అభిమానుల ఔదార్యానికి మచ్చుతునకలేనని. ఆఖరికి 'నా 'కీర్తి'కూడా.

*(మారుతిరావుగారు ఇంతవరకే వ్రాశారు. అంతలోనే అనారోగ్యం పాలవడంతో కొనసాగించలేక పోయారు. గత పదిహేనేళ్ళుగా ఏది వ్రాసినా ముందుగా కౌముదితో పంచుకోవడం అలవాటు కాబట్టి, ఈ ప్రతిని ఇంతమాత్రమైనా భద్రపరచే అవకాశం మాకు లభించింది. విధి చిన్నచూపు చూసి ఉండకపోతే ఇంకెన్నో విశేషాలు విని ఉండేవాళ్ళం..)*